


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 337, పేజీలు - 08
బుధవారం, ఏప్రిల్ 30, 2025 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

# లోటస్ ఆపరేషన్ లోకల్

## - తెలంగాణలో బీజేపీ సరికొత్త వ్యూహం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటి వరకూ ఓ లెక్క, ఇప్పటి నుంచి మరో లెక్క అంటోంది బీజేపీ. లెక్కలు మారబోతున్నాయని ప్రత్యర్థులకు హెచ్చరిక సైరన్ చేస్తోంది. అధికారం దిశగా సరికొత్త వ్యూహాలకు పదునుపెడుతూ ముందుకు సాగుదాం అంటోంది బిజెపి అదిష్టానం. కేవలం మాటలు మాత్రమే కాదు, ఇప్పటికే ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు సంకేతాలందుతున్నాయి. తెలంగాణలో గతంతో పోల్చితే బిజేపి బాగా బలపడింది. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ తరువాత తామే అంటూ ఆ పార్టీ నేతలు మాంచి జోష్ మీదున్నారు. ప్రభుత్వంపై విమర్శలు, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నిల్లో మతం కార్డు ప్రయోగించడం అందులో భాగమే అంటున్నారు. ఇలా రాష్ట్ర రాజకీయాల్లో బిజెపి నేతలు జోరు పెంచుతున్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి అధికారం కోసం ఉవ్విల్లూరుతున్న బిజెపి అధిష్టానానికి మాత్రం ఆ కల నెరవేరడం లేదు. కలగానే మిగులుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల తరువాత నుంచి బిజెపి లెక్క మారింది. అదృష్టం జస్ట్ ఒక్క అడుగు దూరంలోనే ఉందని నాయకత్వం నమ్ముతోంది. తెలంగాణలో కాషాయ జెండా ఎగరం ఖాయం, ఈసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యం అనే ధీమాలో ఉన్నారు బిజెపి నేతలు. ఈసారి కేవలం మాటలు చెప్పడం కాదు, చేతల్లో చూపించాలని అధిష్టానం సీరియస్‌గా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు చాలా టైం ఉంది, ఇప్పుడే ఎందుకంత తొందర అనుకుని వదిలేస్తే కుదరదు. ఇప్పటి నుంచి జనంలోకి వెళ్లాలి. పార్టీ క్యాడర్‌ను మరింత బలోపేతం చేసుకోవాలి. బలం, బలగం చేజారకుండా చేయడంతోపాటు బలహీనతలపై అందకంటే ఎక్కువ శ్రద్ధపెట్టాలని కేంద్ర పెద్దలు భావించారు. అందుకే తెలంగాణలో ఇప్పటి నుంచే ఆపరేషన్ లోకల్ మొదలు పెట్టాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ ఆపరేషన్ లోకల్‌లో భాగంగా తెలంగాణలోని జిల్లాల వారీగా పార్టీ బలాలు, బలహీనతలు గుర్తించే బాధ్యతను కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అప్పగించినట్లుగా సమాచారం. ముఖ్యంగా ఖమ్మం,వరంగల్ , నల్గండ జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఫిక్సయ్యారట కేంద్రపెద్దలు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ జిల్లాలోనే పార్టీ బలహీనంగా ఉందని రాష్ట్ర నాయకత్వంతోపాటు, కేంద్రం సైతం ఓ క్లారిటీకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మూడు జిల్లాల్లో పార్టీ బలాలు ,బలహీనతలు వెంటనే గుర్తించాలి.

స్థానిక సమస్యలపై పోరాటం చేసేందుకు కార్యచరణ రూపొందించాలి. ఇతర పార్టీల నుంచి సమర్ధులైన నాయకులను ఆకర్షించాలి. పార్టీలో చేరికలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని కదిలించేలా నిరసనలు, ఆందోళనలు చేసేందుకు బిజెపి నేతలు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ఇప్పటికే ఏర్పడ్డ బూత్ కమిటీలు, మండల కమిటీలు, జిల్లా కమిటీల ఎన్నికపై మరోసారి క్రాస్ చెక్ చేసేందుకు ఇన్ ఛార్జ్ లను అధిష్టానం నియమించినట్లు

2లో..

# సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

## - ఉగ్రదాడిపై ప్రధానమంత్రి మోదీ కీలక భేటీ

- రక్షణ మంత్రి, సీడీఎస్, ఎన్ఎస్ఏ, త్రివిధ దళాధిపతులు హాజరు
- దేశ అంతర్గత, సరిహద్దు భద్రతపై లోతైన చర్చ
- ఉగ్రవాద నిర్మూలనకు సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ప్రకటన
- దాడికి గట్టి బదులిస్తామని ప్రధాని స్పష్టీకరణ




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇప్పటివరకు ఆచితూచి అడుగులు వేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. దాయాది దేశాన్ని అన్ని రకాలుగా దిగ్బంధనం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేసిన భారత్ ఇప్పుడు ఆ దేశంపై నేరుగా దాడి చేసేందుకు రెడీ అయింది. పాక్‌తో ఉద్రిక్తతల వేళ తన నివాసంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ ధోవల్, త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ కీలక భేటీ నిర్వహించారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత క్షణం తీరిక లేకుండా వరుస భేటీలు నిర్వహిస్తూ దీనిపై ఎలా ముందుకు వెళ్లాలి అనేది సమాలోచనలు జరుపుతున్నారు. ఇప్పటికే దౌత్య పరంగా, ఆర్థిక పరంగా పాకిస్తాన్‌ను దెబ్బ కొట్టిన భారత్ మరిన్ని ఆంక్షలు, నిషేధాలతో ఉక్కిరి బిక్కిరి చేసేందుకు సిద్ధం అవుతోంది. కేవలం యుద్ధం, సర్జికల్ స్ట్రైక్స్ మాత్రమే కాకుండా మోదీ సర్కార్ మరింత పెద్ద ప్లాన్ వేస్తోందనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా నిర్వహించిన కీలక సెక్యూరిటీ భేటీలో ప్రధాని మోదీ కీలక ఉత్తర్వులు వెల్లడించారు. ఉగ్రవాదంపై చేస్తున్న

2లో..

# రూ.6.6 లక్షల కోట్ల రుణ ప్రణాళిక

## - ఎస్ఎల్‌బీసీ సమావేశంలో కీలక నిర్ణయాలు




అమరావతి (ప్రశ్న న్యూస్) 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రూ.6,60,000 కోట్ల రుణ ప్రణాళికను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. గత ఏడాది కంటే 22 శాతం అధికంగా రుణ ప్రణాళికకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్లు ఆమోదం తెలిపారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన 231వ ఎస్ఎల్‌బీసీ సమావేశమై వివిధ నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు వస్తున్నాయనీ అండగా నిలవాలని బ్యాంకర్లను సీఎం కోరారు. ఎంఎస్ఎంఈలకు బ్యాంకులు చేయూతనివ్వాలనీ స్పష్టం చేశారు. వచ్చే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంపద సృష్టి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నామని, ఓవైపు స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా పనిచేస్తూనే 2029 నాటికి పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి బ్యాంకులు సంపూర్ణ మద్దతివ్వాలని, 2025-26లో నిర్దేశించుకున్న క్రెడిట్ ప్లాన్ లక్ష్యాలను అధిగమించేలా కృషి చేయాలని

2లో..

# మా జాతిని కాపాడండి

**- ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయాలి**
**- కేంద్రాన్ని కోరిన మంత్రి సీతక్క**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మావోయిస్టులను అంతం చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ను తెలంగాణ మంత్రి సీతక్క వ్యతిరేకించారు. ఆదివాసీల ప్రయోజనాల దృష్టిలో ఆపరేషన్ కగార్ ను కేంద్రం తక్షణం నిలిపివేయాలని కోరారు. ఆదివాదీల ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ 'తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలి. మధ్య భారతదేశంలోని ఆదివాసి

2లో..

# బదిలీపై భగవద్గీత సందేశంతో సమాధానం

**- స్మితా సబర్వాల్ ను బదిలీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**
**- 'కర్మణ్యే వాధికారస్తే' అంటూ స్మిత ట్వీట్**
**- పర్యాటక శాఖలో అత్యుత్తమ సేవలు అందించానన్న స్మితా**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న స్మితా సబర్వాల్‌ను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్‌కు పర్యాటక శాఖ బాధ్యతలను అప్పగించింది. స్మితా సబర్వాల్‌ను రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీ నేపథ్యంలో ఎక్స్ వేదికగా స్మితా సబర్వాల్ స్పందించారు. భగవద్గీతలోని "కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన" శ్లోకాన్ని ఉటంకిస్తూ ఆమె తన పోస్ట్‌ను ప్రారంభించారు. "పర్యాటక శాఖలో నాలుగు నెలలు పనిచేశాను. నా వంతుగా అత్యుత్తమంగా సేవలు అందించేందుకు ప్రయత్నించాను. రాష్ట్రానికి మొట్టమొదటిసారిగా, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 2025-30 పర్యాటక విధానాన్ని తీసుకువచ్చాం. ఇది ఇప్పటివరకు నిర్లక్ష్యం చేయబడిన పర్యాటక ప్రాంతాలకు

2లో..

# పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ ధోనీలా మారండి

- వైసీపీ జిల్లా అధ్యక్షులతో పార్టీ అధినేత వైఎస్ జగన్ సమావేశం
- పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రధాన చర్చ
- ప్రతిపక్షంలో చురుకైన పాత్ర పోషించాలని నేతలకు పిలుపు)



అమరావతి (ప్రశ్న న్యూస్) మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీలో నూతనోత్తేజం నింపే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీని గ్రామస్థాయి నుంచి పునర్నిర్మాణం చేయాలని నిర్ణయించిన వైఎస్ జగన్ ఆ క్రమంలోనే పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పార్టీలోని కీలక పదవులను భర్తీ చేస్తున్నారు. అలాగే పొలిటికల్ అడ్వైజరీ కమిటీ పేరుతో ఇటీవలే 33 మంది సభ్యులతో సలహా మండలిని కూడా ఏర్పాటు చేశారు. ఇక పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నేతలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే వైసీపీ జిల్లా అధ్యక్షులతో వైఎస్ జగన్ మంగళవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఏపీలోని తాజా రాజకీయ పరిస్థితులపై వైఎస్ జగన్ వారితో చర్చించారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడుతోందని జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని

2లో..

# మిస్ వరల్డ్ పోటీలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- మే 10న ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ పోటీలు
- అతిథులు, పోటీదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎం ఆదేశం
- విమానాశ్రయం, హోటళ్లు, చారిత్రక ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతకు సూచన




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఈవెంట్‌కు వేదిక కానుంది. మిస్ వరల్డ్ - 2025 అందాల పోటీని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సమీక్ష నిర్వహించారు. అధికారులతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వేంపల్లి నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో మే 10న ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి పలు అంశాలపై సీఎం సమీక్షించారు. ఈ మేరకు కార్యక్రమం కోసం తీసుకోవాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పట్టణ అభివృద్ధి సహా పలు అంశాలపై సమగ్రంగా చర్చ జరిపారు. ఈ పోటీల కోసం విదేశాల నుంచి వచ్చే కంటస్టెంట్స్, గ్లోబల్ అతిథులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కార్యక్రమం కోసం ఏర్పాట్లు చేయాలని సీఎం ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఎయిర్‌పోర్ట్ నుంచి హోటళ్ల వరకూ ప్రత్యేక వీఐపీ వాహనాలు, వెల్కమ్ టీంలను ఏర్పాటు చేయాలని, గెస్ట్‌లు గమ్యం చేరే సమయానికి ప్రతి విషయాన్ని ప్రొఫెషనల్‌గా నిర్వహించాలని సూచించారు. అంతే కాకుండా పోటీలలో పాల్గొనేవారికి తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసే విధంగా హోటళ్లలో 'వెల్కమ్ కిట్స్', స్పెషల్ మెనూలు, పర్సనలైజ్డ్ హాస్పిటాలిటీని అందించాలన్నారు. మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు హోటళ్ల వద్ద ప్రత్యేక భద్రతా బలగాలు, మహిళా పోలీస్‌లు

2లో..

# రికార్డు స్థాయి ఎండలు

**- జగిత్యాలలో 44.4 డిగ్రీలు నమోదు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 44.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రతగా పరిగణిస్తున్నారు. జగిత్యాల జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ తీవ్రమైన ఎండలు ఉన్నాయి. నిర్మల్ జిల్లాలోని దస్తురాబాద్‌లో 44.3 డిగ్రీల సెల్సియస్, నిజామాబాద్ జిల్లాలోని మెందోరాలో 44.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీలైనంత వరకు ఎండలో తిరగకపోవడమే మంచిదని

2లో..

# నాసా-ఇస్రో మిషన్‌లో అంతరిక్ష యాత్రకు భారత ఐఏఎఫ్ పైలట్



2లో..

# భూదాన్ భూముల అక్రమాలపై ఈడీ ప్రకటన




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భూదాన్ భూముల అక్రమ విక్రయాలపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్

2లో..

# భూదాన్ భూముల వివాదం

**- హైకోర్టును ఆశ్రయించిన ఐపీఎస్ అధికారులు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భూదాన్ భూముల అంశంలో గతవారం హైకోర్టు సింగిల్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తేలింది. ఈ వ్యవహారంపై పలువురు ఐపీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ బెంచ్ తీర్పుపై మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సౌమ్యా మిశ్రా అప్పీల్ పిటిషన్ చేశారు. పిటిషనర్లు 74 మందిని ప్రతివాదులుగా చేర్చారు. ప్రతివాదుల జాబితాలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లు ఉన్నారు. ఈ నెల 24న 27 మంది అధికారుల భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ జస్టిస్ భాస్కర్ రెడ్డి ఈ తీర్పును వెల్లడించారు. భూదాన్ భూముల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలని

2లో..

# పాకిస్తాన్‌పై ప్రేమ ఉంటే భారత్ వదిలిపోండి

- పహల్గామ్ దాడి నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం కీలక వ్యాఖ్యలు
- మత ప్రాతిపదిక 26 మందిని చంపినా పాక్‌కు అనుకూలంగా మాట్లాడటం సరికాదన్న పవన్
- అలా మాట్లాడాలనుకుంటే ఆ దేశానికే వెళ్లిపోవాలన్న జనసేనాని
- ఉగ్రవాదం, హింసపై అందరూ ఒకేలా స్పందించాలన్న డిప్యూటీ సీఎం




అమరావతి (ప్రశ్న న్యూస్) జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలో అమాయక పర్యాటకులపై జరిగిన కిరాతక ఉగ్రదాడి యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. మానవత్వం మంటగలిసిన ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో అమరులైన వారికి జనసేన పార్టీ ఘనంగా నివాళులర్పించింది. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

2లో..

# లోటస్ ఆపరేషన్ లోకల్

తెలుస్తోంది. క్యాడర్‌ను ఉత్తేజపరిచే కార్యక్రమాలతోపాటు, ఆర్ ఎస్ ఎస్, విహెచ్పీ వంటి సంఘ్ పరివార్ సంస్థలతో కలసి ప్రజాసమస్యలపై పోరాటం చేయడం ద్వారా లోకల్ గా ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తోంది. ఇలా ఓ వైపు ఈ జిల్లాలో నిర్మాణాత్మకంగా కార్యకర్తలను తయారు చేసుకోవడంతోపాటు, ప్రభుత్వం చేపట్టే ప్రజావ్యతిరేక విధానాలపై జనాన్ని సంఘటితం చేయడం, వారికి మద్దతుగా పోరాడుతూ బిజేపీ అంటే లోకల్, లోకల్ అంటే బిజెపి అనేలా ఇప్పటి నుంచి ప్రజలకు మరింత దగ్గరవ్వాలని భావిస్తోంది. ఇలా ఆపరేషన్ లోకల్ పై దృష్టిపెట్టడం ద్వారా అధికారం చేతి నుంచి కమలం వశం చేసుకొచ్చనే మాస్టర్ ప్లాన్‌తో తెలంగాణలో బీజెపి వ్యూహాత్మకంగా దూసుకోపోతోంది.

# సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

పోరులో భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అణచివేయడమే తమ సంకల్పమని తేల్చి చెప్పారు. భారత సాయుధ దళాల సామర్థ్యంపై తమకు పూర్తి స్థాయిలో విశ్వాసం ఉందని వెల్లడించారు. ఇక ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ సైన్యానికి ఉంటుందని ప్రధాని మోదీ ప్రకటించారు. తేదీ, సమయం, లక్ష్యం నిర్ణయించుకునే అధికారాన్ని ప్రధాని మోదీ సైన్యానికే వదిలేశారు. దీంతో ఏ క్షణం ఏం జరుగుతుందోననే ఉత్కంఠ మరింత పెరిగిపోయింది. ఇండియన్ ఆర్మీపై తనతో పాటు 140 కోట్ల భారతీయులకు పూర్తి నమ్మకం, విశ్వాసం ఉందని ప్రధాని మోదీ తెలిపారు. పహల్గాంలో కాల్పులకు తెగబడి 26 మంది అమాయక పర్యాటకులను పొట్టనబెట్టుకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని తేల్చి చెప్పారు. వారిని అత్యంత కఠినంగా శిక్షించడమే కాకుండా వారికి అండగా ఉన్న వారికి కూడా ధీటైన జవాబు ఇస్తామని పరోక్షంగా పాక్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇందుకు తేదీ, సమయం భారత సైన్యమే డిసైడ్ చేస్తుందని వెల్లడించారు. ఉగ్రవాదులకు ఎలాంటి శిక్ష విధించాలో సైన్యమే నిర్ణయిస్తుందని తెలిపారు. ఇంకోసారి భారత్ వైపు కన్నెత్తి కూడా చూడకుండా వారిపై ఇండియన్ ఆర్మీ స్ట్రాంగ్ రివేంజ్ తీర్చుకుంటుందనే నమ్మకం తనకు ఉందని ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# రూ.6.6 లక్షల కోట్ల రుణ ప్రణాళిక

సచివాలయంలో జరిగిన 231వ స్టేట్ లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎం సూచించారు.

### - ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్

2024–25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఫలితాలపై బ్యాంకింగ్ అధికారులతో చర్చించిన సీఎం, 2025–26 లక్ష్యాలను నిర్దేశించారు. 100 శాతం లక్ష్యాలను అధిగమించి దక్షిణ భారతదేశంలోనే మేటిగా ఉన్నందుకు బ్యాంకర్లను సీఎం అభినందించారు. సమావేశంలో 2025–2026 ఆర్థిక సంవత్సరానికి 'ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్'ను సీఎం ఆవిష్కరించారు. డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏం చేయగలం అనేది బ్యాంకర్లు ఆలోచించాలని చెప్పారు. తరచూ ఎస్ఎల్‌బీసీ సమావేశాలు నిర్వహించడానికి ప్రధాన కారణం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బ్యాంకుల మద్దతు కూడగట్టేందుకేనని అన్నారు.

### - బ్యాంకుల మద్దతు తప్పనిసరి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలు, పరిశ్రమల రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని కానీ రాష్ట్ర విభజన తర్వాత ప్రాధాన్యతలు మారాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగ ఆధారిత రాష్ట్రం కావడం, దీనిపై ఎక్కువమంది ఆధారపడి జీవిస్తుండటంతో వ్యవసాయరంగానికి అండగా నిలిచామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను సైతం బలోపేతం చేసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. డిమాండ్‌కు తగ్గట్టుగా ఏ రంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరి అని చెప్పారు. వివిధ రంగాల్లో భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయని, వాటికి అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలు, అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం చెప్పారు. 2029 కల్లా పేదరికం నిర్మూలించేలా జీరోపావర్టీ–పీ4 అమలు చేసి అసమానతలు తొలిగించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సంపద సృష్టికి, మౌలిక సదుపాయాల కల్పనకు పీపీపీ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేస్తున్నామన్నారు.

### - మహిళా ఎంట్రప్రెన్యూర్లకు ప్రాధాన్యత

అమరావతి భవిష్యత్ అవకాశాలకు వేదికగా చేస్తున్నామని, అటు రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని సీఎం అన్నారు. పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలని, మత్స్యకారులు మధ్యవర్తుల ప్రమేయంతో నష్టపోతున్నారని వారికి నేరుగా రుణాలు ఇవ్వాలని సూచించారు. సముద్ర ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు చేయొచ్చని దీనికి బ్యాంకర్ల మద్దతు అవసరమన్నారు. ప్రత్యేకంగా మహిళా ఎంట్రప్రెన్యూర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఎడ్యుకేషన్, హౌసింగ్ విషయంలోనూ ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు.

### - 127 శాతం వృద్ధి నమోదు

2024–25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం క్రెడిట్ ప్లాన్ రూ.5,40,000 కోట్లు లక్ష్యం పెట్టుకోగా, లక్ష్యాన్ని అధిగమించి రూ.6,83,672 కోట్ల రుణాలు అందించినట్టు బ్యాంకర్లు వివరించారు. నిర్దేశించిన లక్ష్యంలో 127 శాతం వృద్ధి నమోదు చేసినట్టు తెలిపారు. ప్రాథమిక రంగానికి రూ.4,14,824 కోట్లు, ఇతర రంగాలకు రూ.2,68,848 కోట్లు అందించామనీ వెల్లడించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.2,64,000 కోట్ల మేర రుణ ప్రణాళిక లక్ష్యంగా పెట్టుకుని రూ.3,07,089 కోట్ల రుణాన్ని బ్యాంకులు అందించాయనీ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఖరీఫ్‌లో రూ.1,69,797 కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు రుణాన్ని అందించినట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ఎంఎస్ఎంఈ రంగాలకు ఈసారి భారీ ఎత్తున్న క్రెడిట్ ప్లాన్ అమలు చేసినట్టు బ్యాంకర్లు వివరించారు. గత ఏడాది రూ.87,000 కోట్ల లక్ష్యానికి గాను రూ.95,620 కోట్లు ఇచ్చాయి. ఇందులో మైక్రో ఎంట్రప్రైజెస్‌కు రూ.49,552 కోట్లు, స్మాల్ ఎంట్రప్రైజెస్‌కు రూ.27,632 కోట్లు, మీడియం ఎంట్రప్రైజెస్‌కు రూ.18,138 కోట్లు, ఇతర వాటికి రూ.298 కోట్లు రుణంగా అందించాయి.

### - వృద్ధి రేటు పడిపోవడంపై ఆర్థికమంత్రి ప్రశ్న

మరోవైపు క్రెడిట్ ప్లాన్ అమలులో ప్రతీ ఏటా వృద్ధి రేటు పడిపోవడంపై బ్యాంకర్లను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. 2021–22 సంవత్సరంలో లక్ష్యంలో వృద్ధి 133 శాతం, 2022–23లో 163 శాతం, 2023–24లో 138 శాతం ఉంటే 2024–25లో లక్ష్యంలో వృద్ధి 127 శాతమే ఉండటంపై మంత్రి వివరణ అడిగారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్ను 22 శాతం అధికంగా రూ.6,60,000 కోట్లకు లక్ష్యాన్ని పెంచారు. ఇందులో వ్యవసాయ రంగం లక్ష్యం రూ.3.06,000 కోట్లు, ఎంఎస్ఎంఈ రూ.1,28,000 కోట్లుగా నిర్దేశించారు. ప్రాధాన్యరంగానికి రూ.4,58,000 కోట్లు, ప్రాధాన్యేతర రంగానికి రూ.2,02,000 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారు.

# బదిలీపై భగవద్గీత సందేశంతో సమాధానం

దిశానిర్దేశం చేయడంతో పాటు, పెట్టుబడులను ఆకర్షించడానికి బలమైన పునాదిగా నిలుస్తుంది" అని ఆమె వివరించారు. హైదరాబాద్ లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీల గురించి ఆమె ప్రస్తావిస్తూ "ఒక గ్లోబల్ ఈవెంట్‌కు అవసరమైన ప్రణాళిక, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు పునాది వేశాను. ఇది అనేక అవకాశాలకు తలుపులు తీస్తుందని నేను విశ్వసిస్తున్నాను. పర్యాటక శాఖలో పనిచేయడం గర్వంగా, గౌరవంగా భావిస్తున్నాను" అని అన్నారు. స్మితా సబర్వాల్ చేసిన ఈ పోస్ట్‌పై పలువురు నెటిజన్లు స్పందిస్తూ, పర్యాటక రంగంలో ఆమె చేసిన కృషిని ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్ శివార్లలోని కంచ గచ్చిబౌలి భూముల కేటాయింపు వ్యవహారంలో స్మితా సబర్వాల్ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది. ఈ వివాదం నేపథ్యంలోనే ఆమెపై బదిలీ వేటు పడి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గచ్చిబౌలి భూముల అంశంలో ఆమెకు పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం కూడా తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆమెను తక్కువ ప్రాధాన్యత కలిగిన ఆర్థిక సంఘానికి బదిలీ చేశారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# రికార్డు స్థాయి ఎండలు

సూచించింది. వృద్ధులు, చిన్నపిల్లలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే స్థాయిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# మా జాతిని కాపాడండి

ప్రాంతాలు రాజ్యాంగంలో పేర్కొన్న షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయి. కనుక అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులు ఉంటాయి. ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయి. కేంద్రం వాటిని అమలు చేయాలి. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించి ఆదివాసీల శాంతియుత జీవన విధానానికి ఏ ఆటంకాలు లేకుండా చూడాలి. ఎందుకంటే ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలి. కేంద్ర ప్రభుత్వం బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుతున్నాను. ఎవరు అధికారంలో ఉన్నా ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దు. ఆ జాతి బిడ్డగా ఆది వాసులకు అండగా నిలుస్తాను. మోదీ సర్కార్ కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్ తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపిస్తాయి. కనుక మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని' మంత్రి సీతక్క కోరారు.

# పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ ధోనీలా మారండి

వైసీపీ జిల్లా అధ్యక్షులకు సూచించిన జగన్ ఒకరి ఆదేశాల కోసం ఎదురు చూడవద్దంటూ నిర్దేశించారు. ప్రజా సమస్యలపై స్వచ్ఛందంగా కదలాలని పిలుపునిచ్చారు. జూన్–జులై నెలల్లోగా గ్రామస్థాయి, మున్సిపాలిటీలలో కమిటీల నియామకం పూర్తి చేయాలని సూచించారు. అక్టోబర్ నాటికి బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలని వైసీపీని వ్యవస్థీకృతంగా పటిష్టం చేయాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం గట్టిగా కృషిగా చేయాలని సూచించారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ ప్రతి కమిటీ బలంగా ఉండాలని పార్టీలో అంతర్గత సమస్యలు తలెత్తితే పరిష్కరించాలని సూచించారు. మరోవైపు విపక్షంలో ఉన్న సమయంలోనే నేతల సత్తా, నాయకత్వ ప్రతిభ తెలుస్తుందని వైఎస్ జగన్ అభిప్రాయపడ్డారు. క్రికెట్‌లో భారీ టార్గెట్ ముందున్నప్పుడే బ్యాటర్ టాలెంట్ తెలుస్తుందని ఆ టార్గెట్ ఛేజ్ చేసినప్పుడే ఆ బ్యాటర్ అంటే అందరికీ ఇష్టం కలుగుతుందని అన్నారు. రాజకీయాల్లోనూ అంతేనన్న వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మనం చేసే పనుల వల్లనే గుర్తింపు దక్కుతుందన్నారు. విపక్షంలో ఉన్న సమయంలో చేసే పనుల వలనే ప్రజల వద్ద, పార్టీలో గౌరవం పెరుగుతుందన్నారు. అందుకే నేతలు అందరూ ధోనీల్లా తయారు కావాలని వైఎస్ జగన్ సూచించారు. అప్పుడే జిల్లాలలోని అన్ని స్థానాలను పార్టీ గెలిచే అవకాశం కలుగుతుందంటూ దిశా నిర్దేశం చేశారు. ప్రజా వ్యతిరేక విషయాల మీద గట్టిగా పోరాటం చేయాలని బాధితులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే వ్యతిరేకత వచ్చిందని ఈ నేపథ్యంలో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం ఉద్ధృతం చేయాలని సూచించారు.

# మిస్ వరల్డ్ పోటీలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

అందుబాటులో ఉండాలని సూచించారు. ఇక ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా ప్రణాళికలు రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. పోలీస్ శాఖ అధినేతలతో సమన్వయంతో సీసీటీవీలు, ఫేస్ రికగ్నిషన్ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ వంటి ఆధునిక టెక్నాలజీ వినియోగించాలన్నారు. మరోవైపు తెలంగాణలో చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అంతే కాకుండా ఈవెంట్‌కు ముందే నగరంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, లైటింగ్, గ్రీనరీ, హోర్డింగ్‌లు, వాల్ ఆర్ట్‌లను పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులకు స్పష్టమైన డెడ్‌లైన్ ఇచ్చారు. మిస్ వరల్డ్ సందర్శించే ప్రాంతాలను ప్రత్యేకంగా మేకోవర్ చేయాలని ఆదేశించారు. అంతర్జాతీయ మీడియా కవరేజ్ ను సైతం దృష్టిలో ఉంచుకుని స్పెషల్ ప్రెస్ ఏరియాలు, హైస్పీడ్ ఇంటర్నెట్ హబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అతిథులకు భాషా సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌లేటర్స్, ఇంటర్‌ప్రెటర్స్‌ను నియమించాలన్నారు. ఈవెంట్‌ను సోషల్ మీడియా ద్వారా గ్లోబల్ ప్రమోట్ చేయాలని కమ్యూనికేషన్స్ శాఖకు టాస్క్ అప్పగించారు.

# భూదాన్ భూముల వివాదం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో సీబీఐ, ఈడీలతో దర్యాప్తు చేయించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలానికి చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ఏప్రిల్ 24న విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు విన్న ధర్మాసనం ప్రాథమికంగా రికార్డులను పరిశీలిస్తే నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములు భూదాన్ బోర్డుకు చెందినవని తేలుతోందని స్పష్టం చేశారు. పిటిషన్‌లో ఉన్నత అధికారులపై తీవ్రమైన ఆరోపణలు చేసిన నేపథ్యంలో వారి ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

హైకోర్టు తన విచక్షణాధికారంతో సామాజిక ఆస్తి పరిరక్షణలో భాగంగా ఈ పిటిషన్‌పై విచారణ ముగిసేదాకా ఆ సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేదాకా ఆ భూముల్లో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయరాదని, అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదని ప్రతివాదులను ఆదేశించారు. ఉన్నతాధికారులపై తీవ్రమైన ఆరోపణలున్న నేపథ్యంలో పిటిషన్ను ఉపసంహరించుకోవడానికి పిటీషనర్కు అనుమతించబోమని పేర్కొన్నారు. అనుమతిలేకుండా ఉపసంహరణకు అనుమతించరాదని రిజిస్ట్రీనీ ఆదేశించారు.

ఇందులో ప్రతివాదులైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, భూదాన్ యజ్ఞ బోర్డు, సీసీఎల్ఎలతోపాటు సీబీఐ, ఈడీలకు నోటీసులు జారీ చేస్తూ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత హోదాలో ప్రతివాదులైన ఐఏఎస్, ఐపీఎస్ లు, వారి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలనే ఆదేశిస్తూ తదుపరి విచారణను జూన్ 1వ తేదీకి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో పలువురు ఐపీఎస్‌లు హైకోర్టును ఆశ్రయించారు.

# పాకిస్తాన్‌పై ప్రేమ ఉంటే భారత్ వదిలిపోండి

అనంతరం మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రదాడిపై తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో నమ్మకంతో, ఉల్లాసంగా విహారయాత్రకు వచ్చిన అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు షికారుకు వచ్చినట్లుగా వేటాడారని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. వారి ఐడీ కార్డులు అడిగి, హిందువా, ముస్లింవా అని తెలుసుకుని మరీ అత్యంత క్రూరంగా, కర్కశంగా ప్రాణాలు తీయడం దేశ భద్రతకు సవాల్‌గా మారిందన్నారు. జనసేన పార్టీ తెలుగు రాష్ట్రాలకే పరిమితమైనప్పటికీ, తమది జాతీయ విధానమని చెప్పుకొచ్చారు.ఈ దారుణ దాడిలో కావలికి చెందిన మధుసూదన్ అమరుడైన విషయం తెలిసిందే. మధుసూదన్ కుటుంబానికి జనసేన పార్టీ పక్షాన రూ. యాభై లక్షల పరిహారం ప్రకటించారు పవన్ కళ్యాణ్. ఆ కుటుంబానికి జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు

. ""మనం ఏదో ఒక రూపంలో ప్రాణాలు కోల్పోతాం. అది దేశం కోసం అయితే మన మరణానికి ఒక అర్థం ఉంటుంది' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మదుసూదన్ కుటుంబం ఆ పరిస్థితి నుంచి బయటపడటం కష్టమని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ఉగ్రదాడిలో చనిపోయిన అమరవీరులందరికీ జనసేన పక్షాన మరోసారి నివాళులర్పించారు. ఈ ఘటన దేశం మొత్తాన్ని తీవ్రంగా కలచివేసిందని, పహల్గామ్ ప్రకంపనలు దేశమంతా వ్యాపించాయని పవన్ అన్నారు. సరిహద్దు భద్రతను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిరాయుధులపై దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు. కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్నంత వరకు ప్రశాంతంగా ఉందని, అధికారం రాష్ట్రం చేతిలోకి వచ్చిన తర్వాతే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పవన్ పరోక్షంగా వ్యాఖ్యానించారు. మృతుల కుటుంబసభ్యులు చెబుతున్నట్లుగా, ఉగ్రవాదులు హత్య చేసి 'మోదీకి చెప్పుకోండి' అని అన్నారని పవన్ తెలిపారు. ఉగ్రవాదులపై ఏమాత్రం కనికరం చూపించవద్దని, ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు.

భవిష్యత్‌లో ఇలాంటి దాడులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. దేశమంతా ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. లక్షలాది మంది కశ్మీరీ పండిట్లు వలస వెళ్లిపోవడం, అప్పటి నుంచి కశ్మీర్ అశాంతితో రగులుతూనే ఉండటం బాధాకరమన్నారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఎప్పటికీ అలాగే ఉంటుందని స్పష్టం చేశారు. భారత్ గడ్డపై ఉంటూ పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతున్నారని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. వారికి పాకిస్థాన్‌పై ప్రేమ ఉంటే ఆ దేశానికే వెళ్లిపోవచ్చని స్పష్టం చేశారు. మతం అడిగి చంపేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతుంటే మూర?ంగా నమ్మరెందుకని ప్రశ్నించారు. అతిమంచితనం, అతి సహనం కూడా ప్రమాదకరమేనని హెచ్చరించారు. కాల్చుకుంటూ పోతే చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు. పాకిస్థాన్‌ను మనం మూడు సార్లు ఓడించామని గుర్తుచేశారు. ఉగ్రవాదులను ఎదుర్కోవాలంటే ధైర్యం అవసరమన్నారు. హిందువులకు ఉన్నది ఒక్కటే దేశమని, ఇక్కడ కూడా హిందువులనే టార్గెట్ చేస్తే ఎక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# నాసా-ఇస్రో మిషన్‌లో అంతరిక్ష యాత్రకు భారత ఐఏఎఫ్ పైలట్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత అంతరిక్ష యాత్రల చరిత్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. భారత వాయుసేన (ఐఏఎఫ్) అధికారి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. మే 29న ప్రయోగించనున్న యాక్సియమ్ మిషన్ 4కు ఆయన పైలట్‌గా వ్యవహరిస్తారని యాక్సియమ్ స్పేస్ ఇంక్ మంగళవారం ప్రకటించింది. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రైవేట్ వ్యోమగామి యాత్ర, ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ప్రారంభం కానుంది. మే 29న, భారత కాలమానం ప్రకారం రాత్రి 10:33 గంటలకు స్పేస్‌ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌక ద్వారా శుక్లా బృందం నింగికి బయలుదేరుతుంది. ఈ యాత్రలో శుక్లాతో పాటు మిషన్ కమాండర్‌గా మాజీ నాసా వ్యోమగామి పెగ్గీ విట్సన్, పోలాండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నివ్స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కపు సభ్యులుగా ఉన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నాక, శుక్లా బృందం అక్కడ సుమారు 14 రోజుల పాటు గడపనుంది. ఈ సమయంలో వారు పలు శాస్త్రీయ పరిశోధనలు, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా స్పేస్ టెక్నాలజీ, స్పేస్ బయో–మాన్యుఫాక్చరింగ్, బయో–ఆస్ట్రోనాటిక్స్‌పై దృష్టి సారిస్తారని గతంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఇస్రో చేపడుతున్న గగన్‌యాన్, భారతీయ అంతరిక్ష స్టేషన్ వంటి భవిష్యత్ ప్రయోగాలకు అవసరమైన మానవ సహిత అంతరిక్ష యాత్రల నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఈ యాత్ర ఎంతగానో ఉపయోగపడనుంది.

# భూదాన్ భూముల అక్రమాలపై ఈడీ ప్రకటన

అధికారులు తెలిపారు. ఐదు చోట్ల సోదాలు నిర్వహించామని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు తెలిపారు. నలభై ఐదు వింటేజ్ కార్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. భారీగా ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. చాలా మంది ప్రముఖులు, రియల్టర్లు భూదాన్ భూములను కొనుగోలు చేసినట్లు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు తెలిపారు. పెద్ద ఎత్తున విదేశీకరెన్సీతో ఇరవై ఐదు లక్షల నగదును స్వాధీనం చేసుకన్నామని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు తెలిపారు. తమ రెవెన్యూ వారసత్వంగా భావించి కొందరు అక్రమంగా భూదాన్ భూములను విక్రయించారని తెలిపింది. ఈ ఆస్తులను స్వాధీనం చేసుకుని తర్వాత విచారణను కొనసాగిస్తున్నామని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు తెలిపారు.

## పకడ్బందీగా పారదర్శకంగా

# భూ భారతి చట్టం అమలు

**- రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు**

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

**చిగురుమామిడి** భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని పకడ్బందీగా పారదర్శకంగా అమలు చేస్తామని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదని, గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను అలోపేతం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సైదాపూర్ మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం కళ్యాణమండపంలో, చిగురుమామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులకు మంత్రి హాజరయ్యారు.మొదటగా సైదాపూర్ మండల కేంద్రంలో విశాల సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని, కళ్యాణమంటపాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఇదే మండపంలో ఏర్పాటు చేసిన భూభారతి నూతన రెవిన్యూ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. భూమి ఒక గౌరవంగా భావించే రైతుకు ధరణి వచ్చిన తర్వాత మనశ్శాంతి లేకుండా పోయిందని అన్నారు. ధరణి తెచ్చిన భూ వివాదాల కారణంగా రైతుల ఆవేదన, ఆక్రోశం తహసిల్దార్ పై దాడి చేసే వరకు వెళ్లిందని అన్నారు. ధరణి వ్యవస్థ వల్ల రైతు తన భూమిని తాను అమ్ముకునే పరిస్థితి లేదని అన్నారు. అధికారులను గత ప్రభుత్వం దొంగలుగా చిత్రీకరించి రాత్రికి రాత్రి వందల ఎకరాల భూములను వారి పేరు పైకి బదిలాయించుకున్నారని తెలిపారు. 30 సంవత్సరాల కింద ఉన్న భూములు విక్రయించి వెళ్లిపోయిన వారి పేర్లు ధరణిలో వచ్చాయని, దీనివల్ల అసలైన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని సంకల్పంతో, భవిష్యత్తులో ఎలాంటి భూ సమస్యలు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం భూ భారతి నూతన రెవిన్యూ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని తెలిపారు. జూన్ 2 నుండి ఈ చట్టం ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఈ చట్టం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి భూమికి భూధార్ సంఖ్య కేటాయిస్తామని తెలిపారు. భూమికు సంబంధించిన రికార్డులన్నీ ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న రికార్డు చేయడం జరుగుతుందని వెల్లడించారు. చెప్పిన పని చేయలేదని సాకుతో విఆర్ఓ వ్యవస్థను రద్దు చేశారని, భూముల హక్కులను కాపాడేందుకు గ్రామీణ రెవిన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. భూ భారతి చట్టాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా అమలు చేస్తామని అన్నారు. తెలంగాణలో రైతులకు చెందిన ప్రతి భూ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఎవరైనా భూకబ్జాలకు పాల్పడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, తిరిగి ఆ భూములను ప్రజా అవసరాలకు వినియోగిస్తామని అన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, దఫదఫాలుగా పేదలందరికీ ఈ పథకం వర్తింపజేయాలని అధికారులకు సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గం లో తాగు, తాగునీటి అవసరాలు పూర్తిగా పరిష్కరిస్తామని అన్నారు. సహకార పరపతి సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తూ రైతు సమస్యలను పరిష్కరించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా అధికారాల వికేంద్రీకరణ జరిగిందని, అధికారుల బాధ్యత జవాబుదారితనం పెరిగిందని తెలిపారు. గ్రామ పరిపాలన అధికారాల వ్యవస్థ బలోపేతం కానుందని అన్నారు. సాదా బైనామాతో సాగు చేసుకుంటున్న వారికి భూభారతిలో న్యాయం జరగనుందని తెలిపారు. ధరణిలో నియమనిబంధనలు లేకపోవడంతో అధికారులకు, ప్రజలకు మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. భూభారతి ద్వారా స్పష్టమైన నియమాలను ప్రభుత్వ రూపొందించిందని, భూ వివాదాల పరిష్కారానికి ఈ చట్టంలో అన్ని వివరాలు పొందుపరిచారని తెలిపారు. అనువంశికంగా వచ్చే భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారించి వివాదాలకు తావు లేకుండా వారసత్వం హక్కు కల్పిస్తారని తెలిపారు.రెండచెల అప్పీలు వ్యవస్థ ఉండడం వల్ల రైతుకు న్యాయం జరగకపోతే ఉన్నతాధికారులను ఆశ్రయించవచ్చని తెలిపారు. కోర్టులకు వెళ్ళవలసిన అవసరం ఉండదని అన్నారు. ఆరు నెలల కింద ప్రభుత్వం తహసిల్దార్, ఆర్డీవోలకు అధికారాలు ఇవ్వడం ద్వారా జిల్లాలోని 9 వేలకు పైగా భూ సమస్యల దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయి, ఆర్టీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, సహకార సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సుధాకర్, డిసీఓ రామానుజాచార్య, డీఏవో భాగ్యలక్ష్మి, తహసిల్దార్లు రమేష్, మంజుల, ఎంపిడీవో యాదగిరి పాల్గొన్నారు.?

# బుధవారం సింహగిరిపై చందనోత్సవం

**విశాఖపట్నం** బుధవారం సింహగిరిలో చందనోత్సవం జరగనుంది. అప్పన్న స్వామి నిజరూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. నిజరూప దర్శనానికి రెండు లక్షలు మంది భక్తులు వస్తారని అంచనా. సామాన్య భక్తుల దర్శనానికి అధిక ప్రాధాన్యతిస్తూ ఏర్పాట్లు చేసారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్వామివారికి రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. టీటీడీ నుంచి చైర్మన్ బి ఆర్ నాయుడు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. చందనోత్సవానికి రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసారు.

## కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో

# " అంతర్జాతీయ నృత్య దినోత్సవం"

**కాకినాడ** స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాల సమావేశ మందిరం లో కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యాన అంతర్జాతీయ నృత్య దినోత్సవం సంధర్భంగా వాగ్దేవి నృత్య కళాశాల స్థాపకురాలుప్రముఖ కూచిపూడి నాట్య గురువులు కళ్యాణి తేజేశ్వరరావు ని డా అద్దాల ఘనంగా సత్కరించారు.

ఈ సంధర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 29న జీన్-జార్జెస్ నోవెర్రే జన్మదినం సంధర్భంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం జరుపుకుంటామని, ఆయన ఆధునిక బ్యాలెట్ యొక్క "పితామహుడు" అని, ప్రపంచవ్యాప్తంగా ఈ తేదీన జరిగే కార్యక్రమాలు మరియు ఉత్సవాల ద్వారా నృత్య విద్యను ప్రోత్సహించడానికి ఈ రోజు కృషి చేస్తుందని అన్నారు. చాలా రకాల నృత్యాలను ఏరోబిక్ వ్యాయామాలుగా పరిగణించవచ్చని అవి హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించగలవని,బరువు నియంత్రణలో సహాయపడతాయని, ఒత్తిడిని తగ్గించి శారీరక దృఢత్వంతో అనుబంధించబడిన ఇతర ప్రయోజనాలను తీసుకురాగలవని తెలిపారు.

## విశాఖ-కుప్పం-గుంటూరు మేయర్ పదవులు దక్కించుకున్న టిడిపి

**అమరావతి :** విశాఖ గుంటూరు కుప్పం మేయర్ పదవులను దక్కించుకున్న టీడీపీ షాక్ లో వైసీపీ విశాఖ మహానగర పాలక మేయర్ గా పీలా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.జీవీఎంసీ మేయర్‌గా కూటమి అభ్యర్థి, టీడీపీ కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఎన్నికై నట్లు జాయింట్ కలెక్టర్ ప్రకటించి. ఆయనకు ధ్రువపత్రం అందజేశారు.మహా విశాఖ నగర పాలక సంస్థకు 2021లో ఎన్నికలు జరిగినప్పుడు టీడీపీ అభ్యర్థిగా పీలా శ్రీనివాస రావు పేరును అధిష్ఠానం ప్రకటించింది. అప్పట్లో మెజార్టీ లేకపోవడంతో పీలా కు పదవి దక్కలేదు.నాలుగేళ్ల పాటు పార్టీ బలోపేతానికి చేసిన కృషితో పాటు, వైకాపా ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడిన పీలా శ్రీనివాస రావుకు పార్టీ అధిష్ఠానం మరోసారి అవకాశం కల్పించింది. మేయర్‌గా పీలా ఎన్నికతో జీవీఎంసీ కార్యాలయం బయట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.ఆయన అభిమానులు క్రేన్‌పై భారీ గజమాలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాస రావు మాట్లాడుతూ నిస్వా ర్థంగా పనిచేస్తానన్నారు. సీఎం చంద్రబాబునా యుడు చెప్పినట్టు విలువలతోపాటు పార్టీ, ప్రభుత్వ విధానాలకు లోబడి పనిచేస్తానన్నారు.తనకు మేయర్‌గా అవకాశం కల్పించిన కార్పొరేటర్లు, కూటమి నాయకులకు ధన్యవాదా లు తెలిపారు. గుంటూరు మేయర్‌గా కోవెలమూడి గుంటూరు మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర ఎన్నికయ్యారు. కూటమి బలపరిచిన రవీంద్రకు 34, వైసీపీ మద్దతిచ్చిన వెంకటరెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. కుప్పం కూడా టీడీపీకే చిత్తూరు జిల్లా కుప్పం పురపాలిక చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఐదో వార్డు కౌన్సిలర్ సెల్వరాజ్‌ను టీడీపీ అభ్యర్థిగా, హఫీజ్‌ను వైసీపీ ప్రతిపాదించింది. సెల్వ రాజ్‌కు 15 ఓట్లు, హఫీజ్‌కు 9 ఓట్లు వచ్చాయి. దీంతో సెల్వరాజ్ గెలిచినట్లు ప్రకటించారు.

## ముస్లింల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం వక్ఫ్ పై సవరణలు చేపట్టింద

- లక్షల కోట్ల విలువచేసే ఆస్తులు కలిగిన వక్ఫ్ బోర్డు ఇన్నేళ్లు ఎవరి ప్రయోజనాల కోసం పనిచేసిందనే విషయాన్ని గ్రహించాలి
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర

**కరీంనగర్** వక్ఫ్ నిబంధనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడానికి, పేద మధ్యతరగతి ముస్లింల ప్రయోజనాలు, సంక్షేమం అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం వక్ఫ్ (సవరణ) చట్టం చేపట్టిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు. బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు, వక్ఫ్ బోర్డు సవరణ కమిటీ తిమ్మాపూర్ మండల ప్రోగ్రాం కన్వీనర్ బూట్ల శ్రీనివాస్ అధ్యక్షతన వక్ఫ్ చట్ట సవరణ -2025 జన జాగరణ అభియాన్ మండల కార్యశాల ప్రోగ్రాం సోమవారం రోజున కొత్త పల్లి లోని సాయిరాం ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి ఆయన మాట్లాడుతూ వక్ఫ్ అనేది ఇస్లామిక్ చట్ట ప్రకారం ఇవ్వబడిన తిరిగి ఇవ్వలేని దాతృత్వ నిధి అన్నారు. భారతదేశంలో 1996 నుండి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. 2018 కేంద్రీయ వక్ఫ్ పరిషత్ నివేదిక ప్రకారం భారత్లో 10 లక్షల కోట్లకు పైగా అంచనా విలువ కలిగిన ఎనిమిది లక్షల ఎకరాలకు పైగా వక్ఫ్ కు ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అయితే వక్ఫ్ యొక్క పాలన వ్యవస్థ బలహీనంగా ఉండి , బోర్డులో ఎవరు ఎవరికి జవాబు దారి గా ఉండడం లేదని , ఆ కారణం చేతనే మోడీ ప్రభుత్వం వక్ఫ్ వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి వీలుగా వక్ఫ్(సవరణ) చట్టం-2025ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రధానంగా వక్ఫ్ పెద్ద మొత్తంలో ఆస్తులు కలిగి ఉన్న ముస్లిం సమాజ ప్రయోజనాలు ,సంక్షేమం అభివృద్ధి కోసం వక్ఫ్ పనిచేసిన దాఖలాలు ఏమీ లేవని, ముస్లిం సమాజాన్ని దోచుకుందని ఆరోపించారు. ముస్లిం ప్రజా సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన వక్ఫ్ భారత్లో అన్నింటికన్నా పెద్ద స్కామ్ గా తయారైందన్నారు. లక్షల కోట్ల ఆస్తులు కలిగి ఉన్న వక్ఫ్ ముస్లిం సమాజ సంక్షేమ, అభివృద్ధి కోసం ఏనాడు ఆలోచన చేయలేదన్నారు. ఈరోజుకి 31 శాతం ముస్లింలు దారిద్ర్యరేఖకు దిగువనే జీవితాలను గడుపుతున్నారని , వారికి చేయూతనివ్వాలనే ఆలోచన వక్ఫ్ ఏనాడూ చేయలేదన్నారు.ప్రధానంగా వక్ఫ్ భూములలో షాపింగ్ మాల్స్, హోటల్లు, వ్యాపార భవనాలు విలసిల్లుతున్నాయి కానీ పేద ముస్లింలకి ఇప్పటికీ ఏ విధమైన ప్రయోజనం చేకూరలేదన్నారు. 80 శాతం వక్ఫ్ భూములు అవినీతి, అక్రమ కబ్జాలకు గురయ్యాని పేర్కొన్నారు. ముస్లిం వర్గాల సేవ కోసం ఉద్దేశించిన వక్ఫ్ భూమి కొంతమంది వ్యక్తులకు రియల్ ఎస్టేట్ వ్యాపార సామ్రాజ్యంగా మారిందన్నారు. 2018 లో కేంద్ర వక్ఫ్ పరిషత్ వెలువరించిన నివేదికలో వక్ఫ్ బోర్డులో ఏలాంటి పారదర్శకత లేదని, అవినీతి పతాకాస్థాయిలో ఉందని పేర్కొన్న విషయాన్ని ఆయనఈ సందర్భంగా గుర్తు చేశారు.2006 సచార్ కమిటీ నివేదిక ప్రకారం విద్య, ఉద్యోగం, ప్రభుత్వ సేవల పరంగా ముస్లింల పరిస్థితి దళితుల కన్నా అధ్వాన స్థితిలో ఉందని , ఈ పరిస్థితిని మెరుగుపరచకపోతే ఎవరి సంక్షేమం కోసం చట్టం తయారు చేయబడిందో ఆ చట్టం ద్వారానే దోపిడి గురయ్యే అవకాశం ఉందన్నారు.వక్ఫ్ స్కాలర్షిప్ నిధులు నకిలీ లబ్ధిదారుల పేరుతో దోపిడీకి గురయ్యాయని , దీంతో అసలైన పేద ముస్లిం విద్యార్థులు చదువుకునే అవకాశం కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం 70 శాతం వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయని, మిగిలిన ఆస్తులు ,మాల్స్, హోటల్లు, పరిశ్రమలకు నామమాత్రపు లీజుకు కట్టబెట్టారన్నారు. గత వక్ఫ్ బోర్డులో ఉన్న లోపాలను సరి చేస్తూ మోదీ ప్రభుత్వం చట్టంలో సవరణలు చేపట్టిందన్నారు. అయితే ఇన్నాళ్లు వక్ఫ్ ఆస్తులను దోచుకున్నోళ్లకు, సొమ్మును అనుభవించిన కొంతమందికి సవరణ చట్టం మింగుడు పడడం లేదని తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టం పేద ముస్లిం సమాజ ప్రయోజనాలు సంక్షేమ అభివృద్ధి కోసమేననే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి, మోడీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఇట్టి ప్రోగ్రాంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల కన్వీనర్ వక్ఫ్ బోర్డు సవరణ చట్టం కమిటీ కో కన్వీనర్లు గడ్డం శ్రీనివాస్ రెడ్డి , బోనాల మోహన్ ,మండల ఉపాధ్యక్షులు తమ్మనవేణి రాజు,జిల్లా ఓబీసీ కార్యదర్శి ఎర్రోజు లక్మన్ , బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్,బూత్ అధ్యక్షులు బండి స్వామి, తమ్మణవేని మహేష్, గొల్లపల్లి మల్లేశం గౌడ్,సుద్దాల సతీష్,పుట్ట ఓంకార్,లెనిన్, సిరిసిల్ల నర్సయ్య, ఇజ్జగిరి హరీష్, వరుకోలు రాజయ్య, మల్లెతుల అశోక్, వినవంక అంజయ్య, కొత్తూరు శ్రీనివాస్ , చిందం అంజి తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పుష్కర పనులు చేయాలి



**జయశంకర్ భూపాలపల్లి** సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం విఐపి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం ఏర్పాటు, టెంట్ సిటి ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాలు, జాయ్ రైడ్, సత్రం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో పనులు పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్, ఆర్ డబ్ల్యూఎస్, పీఆర్, రవాణా, వైద్య తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఐపి ఘాట్ వద్ద టెంట్ సిటీ, ఎగ్జిబిషన్, ఫుడ్ కోర్టు, స్టాళ్లు, కిడ్స్ జోన్ తదితర ఏర్పాటు చేయుటకు మార్కింగ్ చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. విఐపి ఘాట్ వెళ్ళు రహదారి నిర్మాణానికి మార్కింగ్ చేయాలన్నారు. జాయ్ రైడ్ చేసేందుకు కౌంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. సమయం లేదని పనుల్లో వేగం పెంచాలని సూచించారు. సరస్వతి పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పుష్కరాలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రత్యేక ఘాట్లు, తాత్కాలిక వసతి కేంద్రాలు, ఆరోగ్య శిబిరాలు, తాగునీటి ఏర్పాట్లు, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. ఈ పుష్కరాలలో ప్రత్యేకంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు స్టేజి ఏర్పాట్లు, విద్యుద్దీకరణ చేయాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రవచన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖల అధికారులు సంయుక్తంగా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి విద్యుద్దీకరణ చేయాలని సూచించారు. విధులు నిర్వహించే సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, పార్కింగ్, ఆర్టీసీ ప్రదేశాల్లో సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని తెలిపారు. భక్తులు నదిలోకి వెళ్ళడానికి అనువుగా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయజక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్హార్ నాయక్, దేవాదాయ శాఖ ఎస్ ఈ కనక దుర్గా ప్రసాద్, డిపిఓ నారాయణ రావు, పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధు సూదన్, ఇరిగేషన్, పంచాయతి రాజ్, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈలు తిరుపతి రావు, వెంకటేశ్వర్లు, నళిని, అబ్కారీ ఈఎస్ శ్రీనివాస్, కాటారం డిఎస్పీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్‌లో ఉద్యోగుల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం** సింగరేణి కార్మికుల గుండెకాయ ఉద్యోగులకు దేవాలయం లాంటి హెడ్ ఆఫీస్ లో కార్మికుల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ మణుగూరు కు చెందిన సామాజిక సేవకులు కర్నే బాబురావు మంగళవారం నాడు కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ మరియు ఇన్చార్జి డైరెక్టర్ పా కొప్పుల వెంకటేశ్వర్లు కి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు కర్నే బాబురావు విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు దేవాలయాలు ముస్లింలకు మసీదులు క్రైస్తవులకు చర్చిలు, సిక్కులకు స్వర్ణ దేవాలయం ఎంతనో సింగరేణి ఉద్యోగులకు వారి హృదయాలలో కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ కు అంతటి గొప్ప స్థానం అంతటి భక్తి భావం ఉన్నదనీ. తమ కష్టాలు చెప్పుకోవడం కోసం ఆలయానికి మందిరాలకు భక్తులు ఎలా వెళతారో తమ సమస్యలు చెప్పుకోవడం కోసం కూడా హెడ్ ఆఫీస్ కి ఉద్యోగులు అలా వస్తారు. కానీ కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో ఉద్యోగుల రాకపోకలపై సెక్యూరిటీ విభాగం అమలు చేస్తున్న ఆంక్షలు కార్మికుల ఉద్యోగుల ఆగ్రహానికి, ఆవేదనకు కారణభూతం అవుతున్నాయన్నారు. మాజీ కార్మికులను కార్మిక నాయకులను అయితే మరి చిన్న చూపు చూస్తున్న పరిస్థితి వారు ఏదైనా వినతి పత్రం అందజేయాలని హెడ్ ఆఫీస్ కు వస్తే వారి పట్ల సెక్యూరిటీ విభాగం వారు అనుచితంగా ప్రవర్తించడమే కాక ఆంక్షల పేరుపై వారితోపాటు ఒక కెమెరా సెల్ తో సెక్యూరిటీ గార్డును వెంట పంపడం చివరికి బాత్రూంకి వెళ్దాం అన్నా తప్పని ఇబ్బంది పురాణాలలో హరిశ్చంద్రుని వెనుక నక్షత్రకుడి పాత్రను గుర్త చేస్తున్నారనీ ఆయన ఆవేదన చేశారు.దళితులకు ఆలయాలలో ప్రవేశం ఉండదని కొన్ని రాష్ట్రాలలో కొన్ని సందర్భాలలో వార్తలు వింటూ ఉంటాం కచ్చితంగా అలాంటి సంఘటనలే హెడ్ ఆఫీస్ లో కార్మిక నాయకులకు సింగరేణి ఉద్యోగులకు ఎదురవుతోందనీ ఆయన వాపోయారు. కాంట్రాక్టర్లు కావచ్చు పైరవి కారులు కావచ్చు కార్లలో వస్తే వారికి ఎలాంటి ఆంక్షలు ఉండవని పైగా వారికి సలాం కొట్టి మరీ లోనికి సాగనంపుతారు కాలినడకన లేదా ద్విచక్ర వాహనంపై వస్తే వారి పట్ల చిన్నచూపు కొంతమంది సెక్యూరిటీ అధికారులు గార్డులు కూడా అతిగా ప్రవర్తిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని ఇలాంటి సంఘటనలు కార్మికుల్లో సంస్థ పట్ల వ్యతిరేకతను మూటగట్టుకుంటుందన్నారు ఇది సంస్థకు శ్రేయస్కరం కూడా కాదు ప్రత్యేక తెలంగాణ రాకముందు ఈ పరిస్థితి లేదనీ బలరాం ఎండి అయిన తర్వాత పరిస్థితిలో మార్పు వస్తుందని ఉద్యోగులందరు భావించారనీ, హైదరాబాద్ ప్రజాభవన్ లో మార్పులాగా సింగరేణి భవన్, హెడ్ ఆఫీస్ లో కూడా కొంత మార్పు కనిపించిన మాట వాస్తవం ఎందుకో కానీ అంతే వేగంగా మరలా నిబంధనలు ఆంక్షలు మరింత కఠిన తరం చేస్తున్నారన్నారు చివరికి హైదరాబాద్ కార్పొరేట్ కార్యాలయంలో కూడా అచ్చు ఇలాంటి పరిస్థితి ఉద్యోగులకు ఎదురవుతున్నదనీ, దయచేసి సింగరేణి ఉత్పత్తి ఉత్పాదకతలలో శ్రమజీవులు చీకటి సూర్యులు సింగరేణి ఉద్యోగుల ఆత్మ తల్లి లాంటి సింగరేణి కంపెనీ ఉద్యోగులు సంస్థ కోసం అహర్నిశలు కష్టించి పనిచేస్తున్న ఉద్యోగులు తమ కష్టాలు చెప్పుకునేందుకు హెడ్ ఆఫీస్ రాకపోకలపై ఆంక్షలు సడలించాలని వారికి తగు గౌరవం ఇవ్వాలని అతిగా ప్రవర్తిస్తున్న సెక్యూరిటీ విభాగం అధికారులపై కావచ్చు గార్డులపై కావచ్చు మర్యాద నడుచుకోవాలని వారికి తగు ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నాం నిబంధనలు ఉండకూడదని కాదు అతి మాత్రం అతినే అది ఆయన తమ ఆవేదన వెలిబుచ్చినట్లు తెలిపారు అదేవిధంగా జి.ఎం పర్సనల ఐ ఆర్ అండ్ పిఎం కవితా నాయుడు మేడం కూడా కార్మిక సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేస్తే ఫోటో దిగేటందుకు నిరాకరిస్తున్నారనీ. అంతేకాదు సీనియర్ నాయకులు ఎవరన్నా మేడంని కలుద్దామని వస్తే మర్యాద కోసం అన్నా కనీసం కూర్చోమని కూడా అనరు ఈ అంశం పట్ల కూడా కార్మిక సంఘాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. ఆమె సింగరేణి అధికార ప్రతినిధి అని అన్యధా భావించక వారు కూడా ఈ అంశాన్ని కూడా గమనించాలనీ సమస్య పరిష్కారం అయినా కాకున్నా పెద్దపెద్ద నాయకులే వినతి పత్రాలు తీసుకుని ఫోటో దిగుతారు చివరికి ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న గౌరవ రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి సింగరేణి మంత్రి గౌరవ బట్టి విక్రమార్క , రెవెన్యూ మంత్రి గౌరవ శ్రీనివాస్ రెడ్డి మరియు ఎండి బలరాం కూడా ఎదుటివారు చెప్పేది విని వారు ఎంత చిన్నవారైనా నవ్వుతూ ఫోటో దిగుతారు కొత్తగా పదవి బాధ్యత చేపట్టిన డైరెక్టర్ గా మీతో ఫోటో దిగిన వారు ఎంతగానో సంతోషపడతారు చాలాచోట్ల వారి గురించి వారి మంచితనం గురించి వినటమే కాదు ప్రత్యక్షంగా చూశాం మేడంతో పాటు చాలాచోట్ల వారి గురించి వారి మంచితనం గురించి వినటమే కాదు ప్రత్యక్షంగా చూశాం మేడంతో పాటు ఇతర అధికారులు కూడా వినతి పత్రాలు అందజేసే సమయంలో అందుకోవటంతో పాటు ఫోటో కూడా దిగే విధంగా తగు ఆదేశాలు జారీ చేయాలని వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాను ఫోటో దిగితే పోయేదేమీ లేదు ఎదుటి వారికి ఎంతో సంతృప్తిస్తుందనీ సంస్థ శ్రేయోభిలాషిగా నా విజ్ఞప్తి పరిశీలిస్తారని కూడా ఆకాంక్షిస్తున్నాననీ ఆ లేఖలో బాబు అభిప్రాయపడ్డారు.
పరిస్థితిలో మార్పు రాకపోతే హైదరాబాద్ ఎండి ని కూడా కలిసి హెడ్ ఆఫీస్ ఆంక్షలు పై వారి దృష్టికి తీసుకువెళతానని కర్నే బాబురావు విలేకరులు తెలిపారు.

## విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఎం ఈ ఓ ఇల్లందుల విజయకుమార్

**కమాన్ పూర్** మే 1నుండి పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరం 2025 ను సద్వినియోగం చేసుకోవాలని కమాన్ పూర్ ఎంఈఓ ఇల్లందుల విజయ్ కుమార్ మంగళవారం కోరారు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశానుసరం పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరం 2025 ను మే 1నుండి జూన్ 10 వరకు నిర్వహించనున్నారు, దీని కోసం వాలంటరీస్ లను ఆ పాఠశాల పరిధిలోని గ్రామములో డిగ్రీ చదువు కున్న అభ్యర్థుల ను ఎంపిక చేసుకొని వారికీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమన్ పూర్ లో మంగళవారం నాడు కమాన్ పూర్ మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ అధ్యక్షతన శిక్షణను ఇచ్చారు,.ఈ శిక్షణ లో కమాన్ పూర్ మరియు రామగిరి మండలాల వాలంటరీలు పాల్గొన్నారు, సుమారు 30 మంది వాలంటరీలకు జిల్లా రిసోర్స్ పర్సన్లు నల్ల రవి, జి దేవేందర్ రెడ్డి ఒక రోజు శిక్షణను అందించారు,ఈ శిక్షణ కార్యక్రమం లో ఎం ఈ ఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల లోని సామర్థ్యలను,లేర్నింగ్ గ్యాప్స్ లేకుండా ఈ వేసవి శిక్షణ శిబిరం ఉపయోగపడుతుందని అన్నారు.రోజు ఉదయం 8గంటల నుండి 10:30 వరకు వాలంటరీలు ఆటలు, డ్రాయింగ్, తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు బోదిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలోరామగిరి మండల విద్యాధికారి కొమురయ్య,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి. శోభన్ రావు మరియు క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ప్రభాకర్, మమత హకీమ్ లు పాల్గొన్నారు.

## తొలగించబడిన ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి హర్షనీయం

గత ప్రభుత్వంలో చిన్న చిన్న కారణాలతో అన్యాయంగా తొలగించబడిన 500 పైచిలుకు ఆర్టీసీ ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించి అంచలవారీగా తిరిగి ఉద్యోగాలలో తీసుకుంటామని ప్రకటించి ఇప్పటికే 130 మందిని ఉద్యోగాలలో తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అని తొలగించబడిన ఆర్టీసీ ఉద్యోగులు దాసరి రాంబాబు, వీరాంజనేయులు,శ్రీనివాస గౌడ్ లు తెలియజేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రజా భవన్ ఇంచార్జ్ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య, ఆర్టీసీ ఎండి సజ్జన్నార్ లు తొలగించబడిన ఆర్టీసీ కార్మికుల గోడు విని తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడం సంతోషకరమైన విషయమని అన్నారు. కొంతమంది పనిగట్టుకొని ప్రభుత్వంపై,సజ్జనార్ పై తమ ఆర్టీసీ కార్మికులను రెచ్చగొట్టి చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకోవద్దు అని విజ్ఞప్తి చేశారు. అలాగే వెంటనే తొలగించబడిన ఆర్టీసీ కార్మికులు. కాంట్రాక్ట్ ఉద్యోగులను విధులలోకి తీసుకొని పొట్ట చేత పట్టుకొని రోడ్లమీద ఉన్న తమ కుటుంబాలను నిలబెట్టాలని కోరారు.

## పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని జీహెచ్ఎంసి కార్పొరేటర్లు ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద మృతుల కుటుంబాలకు సంతాపం..

**హైదరాబాద్** జమ్మూ కాశ్మీర్ లోని పహల్ గామ్ లో ఏప్రిల్ 22న పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ జీహెచ్ఎంసి కార్పొరేటర్లు అసెంబ్లీ ముందు ఉన్న అమరవీరుల స్థూపం వద్ద మృతుల కుటుంబాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసి కార్పొరేటర్లు మాట్లాడుతూ... పాకిస్తాన్ దేశ ద్రోహులను తక్షణమే మట్టి కరిపించాలని హెచ్చరించారు. ఇప్పటికైనా దేశ ప్రధాని ఉగ్రవాదులను హతం చేసి దేశాన్ని రక్షించాలని కోరారు.పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశివిక దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండేలా భారత ప్రభుత్వం ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుల మతాలకు అతీతంగా దేశ ప్రజలు ఏకమై తీవ్రవాదాన్ని అంత మొందించేందుకు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.


## తక్షణమే వారంతా పల్నాడును వదిలిపోవాలి

- పల్నాడు జిల్లా ఎస్పీ కంచి. శ్రీనివాసరావు

**నరసరావుపేట** పాకిస్థాన్ పౌరులు ఎవరైనా పల్నాడు జిల్లాలో ఉంటే తక్షణమే వెళ్లిపోవాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. పాకిస్థాన్ వీసాలతో ఉండేందుకు వీలు లేదన్నారు. అక్రమంగా నివసిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా అటువంటి వారికి ఆతిథ్యం ఇచ్చే వారిపైనా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.



## ఆళ్లగడ్డ ఆర్టీసి డిపోలో మంగళవారం డయల్ యువర్




**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ ఆర్టీసి డిపోలో మంగళవారం డయల్ యువర్ డి.ఎం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొబైల్ ఫోన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఉయ్యాలవాడ మండలం చిన్న ఎమ్మనూరు గ్రామం నుండి నొస్సం మీదుగా జమ్మలమడుగు కు గతంలో ఆళ్లగడ్డ డిపో నుండి నడుపుతు తొలగించిన ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఒక ప్రయాణికుడు అధికారుల దృష్టికి తీసుకొని రాగా ఉన్నతాధికారులకు నివేదిక పంపి చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారు.

## అలరించిన వైవిధ్యభరిత డిజైన్లు

**హైదరాబాద్** సర్వకాల సర్వావస్థ ల్లోనూ ధరించేందుకు, ఫ్యాషన్కు చిరునా మాగా కనిపించేందుకు వీలైన వైవిధ్యభరిత డిజైన్లను రూపుదిద్దిన యువ డిజైనర్ల సృజనాత్మక ప్రతిభ వేదికపై మెరుపులు మెరిపించింది. నగరానికి చెందిన వాక్సెన్ యూనివర్శిటీ మాదాపూర్ లోని టీ వర్క్స్ లో నిర్వహించిన 'డిజైన్ వాంగార్డ్- 2025' కార్యక్రమం, ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ ఈవెంట్లో విద్యార్థులు తమ క్రియేటివ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు సమర్పించిన వైవిధ్యభరిత ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సస్టైయినబులిటీ, వేరబుల్ ఇన్నోవేషన్ తదితర కాన్సెప్ట్ తో రూపొందించిన డిజైన్లు అహూ తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలోని 3 డీ ప్రింటెడ్ దుస్తులు, స్మార్ట్ వర్క్ వేర్, సస్టైయినబుల్ ఆర్కిటెక్చర్, మొబిలిటీ సొల్యూషన్స్, ఇంటరాక్టివ్ వీ ఆర్ గేమ్స్.. విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సత్తా చాటారు. తమ విద్యార్థుల ప్రతి భను ప్రపంచానికి పరిచయం చేసేందుకే ఈ వేదిక ఏర్పాటు చేశామని 'వర్సిటీ' డీన్ డా. ఆదితి సక్సేనా తెలిపారు.

## కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామివారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి, :** చిత్తూరు జిల్లా గంగవరం (మం), కీలపట్లలోని శ్రీ కోనేటిరాయస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మే 5 నుండి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 8 నుండి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా గర్భాలయం, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం. గజేంద్ర, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.శ్రీ కోనేటిరాయ స్వామివారి బ్రహ్మోత్సవాలకు మే 4న సాయంత్రం 5.30 నుండి రాత్రి 8.30 గంటలవరకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రాంభమవుతాయి.

## జిల్లాలో జాతీయ రహదారుల భూసేకరణ, రైల్వే నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**తిరుపతి :** జిల్లాలో జాతీయ రహదారులకు మరియు రైల్వే లైన్ కు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నందు జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలిసి వర్చువల్ విధానంలో నేషనల్ హైవే పిడి లు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓ లు రామ్మోహన్, కిరణ్మయి, భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత మండలాల తాసిల్దార్లు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మాణాలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు. జిల్లాలో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టులు, జాతీయ రహదారుల సేకరణకు సంబంధించి పనులను ప్రాధాన్యత తీసుకొని వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. దీనికి సంబంధించి రెవెన్యూ డివిజన్ అధికారులు, తాసిల్దారులు, జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. జాతీయ రహదారి భూసేకరణ పనులు త్వరిత గతిన పూర్తికావడానికి ప్రణాళికను రూపొందించుకొని పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతి ఉన్న రహదారి విస్తరణ పనులు కూడా వేగంగా చర్యలు తీసుకోవాలని భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ పనులలో సంబంధిత ఆర్టీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

# ఉపాధి కూలీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చిన్న చూపు

**బూడిద గణేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి**




మంథని ( ప్రశ్న న్యూస్) ముత్తారం మండలం కేసనపల్లి గ్రామంలో అడవి ప్రాంతంలో జరుగుచున్న ఉపాధి హామీ పనులను సందర్శించి కూలీలతో మాట్లాడి సమస్యలను అధ్యయనం చేయడం జరిగింది ఈ సందర్భంగా బూడిద గణేష్ మాట్లాడుతూ వేసవికాలం కావడం నేల గట్టిగా ఉండడంతో గడ్డపారకు పారకు భూమి తెగకపోవడంతో అధికారులు పెట్టిన కొలతల ప్రకారం చేయలేకపోతున్నారని కూలి గిట్టుబాటు కావడంలేదని అన్నారు గ్రామంలో అధికారులు పనులు చూపకపోవడంతో కూలీల సంఖ్య తగ్గిపోతుందని అన్నారు ఫోటో యాప్ వలన గంటల తరబడి ఎర్రటి ఎండలో వేచి చూడాల్సి వస్తుందని ఎండంత కూలీల మీదనే పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు మండుటెండలో కూలీలు అడవి ప్రాంతానికి వెళ్లి పనిచేస్తున్నారని రవాణా చార్జీలు ఇవ్వడం లేదని విమర్శించారు ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలను చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొలతలు తగ్గించి పనులను చేపట్టాలని రోజు కూలి 600 రూపాయలు ఇచ్చి ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచాలని అలాగే ఉపాధి కూలీలకు ప్రమాద బీమా 10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని వారం వారం పే స్లిప్పులు ఇచ్చి వేతనాలు ఇవ్వాలని పనిముట్లు పార గడ్డపార తట్ట బుట్టలు ఇవ్వాలని పని ప్రదేశంలో టెంటూ మంచినీటి సౌకర్యం మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఉపాధి కూలీలతో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉట్ల శంకరయ్య, కోళ్ల శ్రీనివాస్, తోట సత్తయ్య, గణవేన కుమారస్వామి, నాగుల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు

## ఫైరింగ్ రేంజ్ ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) నార్సింగి గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న ఫైరింగ్ రేంజ్ పనులు పూర్తీ అయ్యి ఐజి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవానికి సిద్దమౌతుందని అన్నారు. గతంలో ఫైరింగ్ ప్రాక్టీస్ కొరకు వేరే జిల్లా లోని ఫైరింగ్ రేంజ్ కు వెళ్లాల్సి వచ్చేది అని అన్నారు. మెదక్ జిల్లా పోలీస్ సిబ్బందికి ఫైరింగ్ రేంజ్ కల సహకారం కాబోతుంది అని అన్నారు. మే 2 తారీకున ఐజి చేతుల మీదగా ప్రారభోస్తావానికి సిద్దమౌతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట్ సీఐ శ్రీ వెంకట రాజా గౌడ్ మరియు మరియు ఆర్ఐ శ్రీ.శైలేందర్ మరియు ఎస్సై లు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తు 30వ తేదిలోగా వార్డు కార్యాలయాల్లో సమర్పించాలి: తహసిల్దార్ వీరబాయి



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) అంబర్ పేట మండల కార్యాలయం పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారు ఆన్ లైన్ దరఖాస్తులను ఈనెల 30వ తేదిలోగా వార్డు కార్యాలయాల్లో అందజేయాలని తహసీల్దార్ వీరాబాయి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ కార్పొరేషన్లతోపాటు ఈ.బి.సి./ఈడబ్ల్యుఎస్ ద్వారా నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయంకోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకం కోసం మండలం కార్యాలయం పరిధిలో ప్రజలు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్ లైన్ దరఖాస్తు చేసిన వారిలో కొందరు ఆయా దరఖాస్తు పత్రాలను వార్డు కార్యాలయంలో అందజేయడం లేదని తహసిల్దార్ పేర్కొన్నారు. ఎవరైతే మీ సేవా కేంద్రాల్లో ఆన్ లైన్ దరఖాస్తు చేసుకుని, వార్డు కార్యాలయాల్లో సమర్పించని వారు అవసరమైన పత్రాలతో పాటు ఈనెల 30వ తేదిలోగా ఆయా కేంద్రాలకు వెళ్లి అందజేయాలన్నారు.

## 22 వ వార్డులో ఘనంగా జర్నలిస్టు దంపతుల పెళ్లిరోజు వేడుకలు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డుకు చెందిన సీనియర్ జర్నలిస్టు వొడ్యాల వేణు-హరిత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వార్డు మిత్రులు,బంధువులు,కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో ఘనంగా పెళ్లిరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి, మిఠాయిలు పంచుతూ,ఒక ప పాత్రికేయునిగా సమాజ పరిరక్షకులుగా సమజాభివృద్ధి కోసం పాటుపడేందుకు వారికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఇలాంటి పెళ్లిరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ వొడ్యాల వేణు-



హరిత ఆదర్శ దంపతులకు హృదయపూర్వక పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు ప్రజలు,తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# సర్జరీ విజయవంతం చేసిన వైద్య బృందానికి అభినందనలు

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

మంథని ( ప్రశ్న న్యూస్) క్లిష్టమైన సర్జరీని విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహించినందుకు గాను వైద్య బృందాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన ఒక మహిళకు ఆరు నెలల క్రితం సీజరియన్ జరిగిందని, అప్పటి నుండి ఆమె అప్పెండిక్స్ తో బాధ పడుతుందని, నిన్న ప్రైవేట్ ఆసుపత్రిలో ఫిజిషియన్ ను సంప్రదించగా ఇది అప్పెండిక్స్ అని చెప్పడము జరిగింది. ఈ క్రిటికల్ కండిషన్ లో ఆ మహిళ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ఏప్రిల్ 25న రావడం జరిగిందని, వెంటనే మహిళను చూసి అడ్మిట్ .చేసుకొని , ఏప్రిల్ 26న డా. సాయి ప్రసాద్, జనరల్ సర్జన్, డా. అమరసింహ రెడ్డి లాప్రోస్కోప్ సర్జన్ డా. కె.శ్రీధర్,సూపరింటెండెంట్, డా. స్వాతి, డా. భవాని కలిసి ఆ మహిళకు లాప్రోస్కోప్ సర్జరీ విజయవంతంగా చేశారని



తెలిపారు. ఈ శస్త్ర చికిత్సను విజయవంతగా నిర్వహించిన డాక్టర్ల బృందాన్ని, ఆసుపత్రి సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో



వివిధ రకాల స్పెషలిస్ట్ సేవలు, శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని, అవసరమైన ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు తెలియ చేసినాడు

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం

- **సేకరించిన ధాన్యం తరలింపునకు ప్రత్యేక చర్యలు - ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**
- **వేములవాడ నియోజకవర్గంలోని 74 కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ప్రారంభించాలి**
- **ధాన్యం విక్రయించిన తర్వాత రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు**
- **మిల్లులకు తరలించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తారు**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్ - 150 లారీలు అదనంగా సిద్ధం**



వేములవాడ, (ప్రశ్న న్యూస్) రాజన్8 సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోలు,ధాన్యం తరలింపు తదితర అంశాల పై ప్రభుత్వ విప్,కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యం తరలింపులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో యాసంగి సీజన్లో ధాన్యం సేకరణ తరలింపు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై సమీక్షించారు. ముందుగా జిల్లాలోని ఆయా మండలాల వారిగా ఎంత ధాన్యం ఉత్పత్తి అయిందో వ్యవసాయ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఐకెపి, పిఎసిఎస్, డిసిఎంఎస్ తదితర కేంద్రాల ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు ఎంత మిల్లులకు తరలించారో ఆరా తీశారు. తేదీ 28- 04 - 2025 వరకు మొత్తం 50 వేల మెట్రిక్ టన్నులు సేకరించామని అధికారులు తెలిపారు. సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించడంలో ఎలాంటి ఇబ్బందులు పడవద్దని సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు ఒప్పందం చేసుకున్న లారీల కాంట్రాక్టర్ జిల్లాలోని ఐదు రూట్లలో దాదాపు 500 లారీలు సమకూర్చాల్సి ఉందని తెలిపారు. సదరు కాంట్రాక్టర్ 180 లారీల వరకు సమకూర్చడంతో దాన్యం తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికిప్పుడు ధాన్యం తరలింపునకు ప్రత్యామ్నాయంగా జిల్లాలోని వంద లారీలను అలాగే రైస్ మిల్లర్ల పరిధిలోని 50



లారీలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. రుద్రంగి,చందుర్తి, కోనరావుపేట,అలాగే బోయినిపల్లి,ఇల్లంతకుంట తదితర మండలాల్లో సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. కూలీల ఇబ్బంది లేకుండా కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేములవాడ నియోజకవర్గంలోని 74 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి,యుద్ధప్రాతిపదికన వెంట వెంటనే తరలించాలని విప్ అధికారులను ఆదేశించారు.

### - రైతులు ఆందోళన చెందవద్దు-ధాన్యం తరలించే బాధ్యత అధికారులదే

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన గ్రామాల్లో వెంట వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని విప్ సూచించారు. రాత్రి వరకు కూడా రైతుల నుంచి ధాన్యం సేకరించాలని ఆదేశించారు. ఆయా శాఖలు సమన్వయంతో పనిచేసి ధాన్యం సేకరించాలని రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. ధాన్యం విక్రయించిన రైతులు సంబంధిత స్లిప్పు పొందిన తర్వాత వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. రైస్ మిల్లర్లకు ధాన్యం తరలింపు విషయం అధికారులు చూసుకుంటారని విప్ స్పష్టం చేశారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

### - రుద్రంగిలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలి

రుద్రంగి పరిధిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని అలాట్ చేసిన రైస్ మిల్లులకు తరలిస్తూనే స్థానిక ఏ.ఎం.సి. గోడౌన్లో కూడా నిల్వ చేయాలని విప్ ఆదేశించారు. దాన్యం కొనుగోలు చేసిన వెంటనే తరలించేలా అధికారులు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఇంకా జిల్లాలోని రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చేందుకు ముందుకు రాకపోతే అపరాల్ పార్క్ లోని గోదాములు, ఏఎంసీ గోదాంలో దాన్యం విలువ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారని వెల్లడించారు. రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని సూచించారు.

### - సన్న వడ్ల సేకరణకు అన్ని ఏర్పాట్లు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సన్న వడ్లు పండించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సేకరిస్తుందని తెలిపారు. తమ గ్రామాలు ఏఏ మిల్లులకు అలాట్ చేశారో వారు సన్నధాన్యం తరలిస్తారని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరతో పాటుగా బోనస్ కూడా పొందాలని సూచించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు అలాగే గోదాములకు తరలించే ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డీ సి ఎస్ ఓ వసంత లక్ష్మి, డిఎం రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలీ బేగం, డిసిఓ రామకృష్ణ, డి టి ఓ లక్ష్మణ్, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, ఐకెపి ఏ.పి.ఎం.లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం

**- భూ భారతి చట్టం రైతులకు చుట్టం - ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్**

వేములవాడ,(ప్రశ్న న్యూస్) భూ భారతి చట్టం రైతులకు చుట్టమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025పై అవగాహన సదస్సును కోనరావుపేట మండలం, నిజామాబాద్ గ్రామంలో మంగళవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై మాట్లాడారు. ముందుగా ధరణి చట్టం.. భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర మంత్రుల సమక్షంలో చట్టం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. కొన్ని రోజులుగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమక్షంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా యాజమాన్య హక్కులు ఉన్నాగానీ వాటిని మనం పొందలేక పోయామని పేర్కొన్నారు. గతంలో అసైన్ మెంట్ కమిటీ ఉండేదని, ధరణి చట్టం తో దానిని తొలగించారని వివరించారు. ధరణి చట్టానికి సరైన ప్రణాళికలు లేకుండా రూపొందించారని విమర్శించారు. తాత ముత్తాతలు కొన్న



భూములును ధరణి వల్ల మళ్ళీ పాత వాళ్ళకే పట్టా ఉండటంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదురుకొన్నారని గుర్తు చేశారు. పేద వారికి ఉపయోగపడే ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేసింది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లులకు ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత విద్యుత్,రూ. 500 సిలిండర్లు సరఫరా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు ఏక కాలంలో



రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందని, దశాబ్దాల కల ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం జరిగిందని చెప్పారు. ఇంకా కొన్ని కార్యక్రమాలను అమలు చేసుకోవాలి త్వరలోనే వాటిని అమలు చేసుకుందామని, యువత కు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రాజీవ్ యువ వికాసం అమలు చేస్తున్నామని వివరించారు. తద్వార సుమారు 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఎల్లయ్య, తహశీల్దార్ వరలక్ష్మీ,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలి

**- మిల్లర్లు లోడింగ్, అన్లోడింగ్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలి**

**- మెదక్ ఆర్డీవో రమాదేవి**

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని, మిల్లర్లు లోడింగ్ అన్లోడింగ్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. మంగళవారం, జిల్లాలోని శంకరంపేట ఆర్ మండల కేంద్రంలో శాలిపేట, అంజా పేట, గానుగుపహాడ్ గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మెదక్ ఆర్ డి ఓ రమాదేవి సందర్శించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని, ధాన్యం కొనుగోళ్ల రిజిస్టర్ లను తనిఖీ చేసి, ఓపీఎంఎస్ లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారా? రైతులు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని ప్రతిరోజూ పరిశీలిస్తున్నారా? సకాలంలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారా? అలాగే కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం కుప్పల గురించి పలు వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వారు స్పందిస్తూ.. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేస్తున్నామని, కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని కూడా ప్రతిరోజూ పరిశీలించి, కావాల్సిన తేమ శాతానికి రాగానే కాంటా పూర్తిచేసి మిల్లులకు తరలిస్తున్నామని కేంద్ర నిర్వాహకులు ఆర్డీవో రమాదేవికి వివరించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని కేంద్ర నిర్వాహకులను హెచ్చరించారు. తాలు లేకుండా సరిచూసుకోవాలని, తేదీ, రైతు పేరు, ఫోన్ నంబర్, ధాన్యం కొనుగోళ్ళ పూర్తి వివరాలతో రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని, తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు పూర్తిచేసి, అదే రోజు సంబంధిత మిల్లులకు తరలించాలని, కేంద్రాల్లో ఎక్కువ రోజుల వరకు నిల్వ చేయకూడదని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు రైస్ మిల్లును సందర్శించి ధాన్యం లోడింగ్ అన్



లోడింగ్ స్టాక్ రిజిస్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు ఈ పర్యటనలో ఆర్డీవో వెంట తాసిల్దార్ మన్నన్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన చేయాలి : ఎస్పీ మహేష్ బి గితే

**- పోలీస్ స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు నమ్మకం, భరోసా కలిగించాలి**




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి పోలీస్ స్టేషన్లను సందర్శించి స్టేషన్ల పరిసరాలు, పలు స్టేషన్ రికార్డులు, పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల వివరాలతో పాటు గతంలో జరిగిన సంఘటనల వివరాలు, స్టేషన్ల పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలతో పాటుగా సిబ్బంది నిర్వహించే విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల ఫిర్యారుదలపై తక్షణమే స్పందించి వారి సమస్యను తెలుసుకొని వారికీ భరోసా నమ్మకం కల్పించాలని, చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. పెట్రోలింగ్ సమయంలో తప్పని సరిగా రౌడీ, హిస్టరీ షీటర్లతో పాటు అనుమానిత వ్యక్తుల తనిఖీ చేస్తూ వారి ప్రస్తుత స్థితిగతులపై అరా తీయాలని, మత్తు పదార్థాలపై, సైబర్ నేరాలపై ముమ్మరంగా గ్రామాల్లో ప్రజలకు, యువతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలన్నారు. అధికారులకు, సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి అని అన్నారు. ఈ తనిఖీలలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐలు రమాకాంత్, ఎల్లగౌడ్, సిబ్బంది ఉన్నారు.

## పహల్గాం ఉగ్రదాడి పై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిరసన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకునే ఏ చర్యలకైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. పహల్గాం ఉగ్రదాడి పై నిరసనగా మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమీషనర్ ఆర్.వి.కర్ణన్, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది నిరసన తెలుపుతూ ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడి భారతీయులందరీ గుండెలను కలచివేసిందని అన్నారు. ఉగ్రవాదం పై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తున్నాయన్నారు. ఉగ్రదాడి మానవతా విలువలకు, శాంతికి, సమాజ శ్రేయస్సుకు వ్యతిరేక చర్యగా ఆమె పేర్కొన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ ఘటనపై ప్రజలందరూ కుల, మతాలకు అతీతంగా ఐక్యతతో స్పందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ రక్షణకు, ప్రజల భద్రతకు తీసుకునే ఏ నిర్ణయానికైనా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం వివిధ పార్టీల కార్పొరేటర్లు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అన్నారు. దేశ ప్రధాని తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి ప్రధాని చేపట్టే అన్ని చర్యలకు భారతీయులుగా తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల కార్పొరేటర్లు, వంగ మధుసూదన్ రెడ్డి, రాధా ధీరజ్ రెడ్డి,లాల్ సింగ్ మీర్జాబేగ్, సోహెల్ ఖాద్రీ, జగదీశ్వర్ రావు, రాజశేఖర్ రెడ్డి,బి జే పీ ,ఏ ఐ ఎం ఐ ఎం కాంగ్రెస్ కార్పొరేటర్లు సి సి పి శ్రీనివాస్, సి ఈ భాస్కర్ రెడ్డి, రత్నాకర్ అడిషనల్ కమిషనర్లు గీత రాధిక,వేణు గోపాల్, సరోజ, పంకజ, జోనల్, కమిషనర్ లు రవికిరణ్, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, వెంకన్న ,సి ఏ అండ్ హెచ్ ఓ డాకర్ పద్మజ తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది,జి హెచ్ ఎం సి కి చెందిన ఆయా యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అంతకు మందు మరణించిన వారికి చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు.

## యువత ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి

**- యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

**- బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి : అతికం రాజశేఖర్ గౌడ్**



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** యువత మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తమ ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి అతికం రాజశేఖర్ గౌడ్ సూచించారు. బోయినిపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ, "విద్యార్థులు, యువత తమకు నచ్చిన ఉద్యోగాల కోసం కష్టపడి ముందుకు సాగాలి. చెడు వ్యసనాలు వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాల నష్టానికి కూడా కారణమవుతాయి,యువత ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయిని వేణు యాదవ్, గణేష్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అసంఘటిత రంగ కార్మికులకు

# వెల్ఫేర్ బోర్డు అమలు చేయాలి

**- భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలి**

**- మే డే స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని - సీఐటీయూ జిల్లా కోశాధికారి నరసమ్మ**

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) సంఘటిత రంగ కార్మికులుగా పనిచేస్తున్న హమాలి ,ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికులకు ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసి ,నిధులను కేటాయించాలని సిఐటియు జిల్లా కోశాధికారి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే డే సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ సమాజంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించేటటువంటి సమాజానికి సేవలు అందించే బజారు ,రైస్ మిల్లు ,మార్కెట్ యార్డు ,గోదాము, బేవరేజ్,షాపు హమాలీ కార్మికులు అనేక రకాలుగా వారి సేవలను సమాజానికి అందిస్తున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు 50 కిలోల 60 కిలోల వడ్లు బియ్యం ఇతర సామాగ్రిని మోస్తూ షాపులకు అందిస్తున్నారు 20 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు హమాలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు సుమారు 45 సంవత్సరాల పాటు బరువలతో కూడిన సామాగ్రిని సంచల ద్వారా ఇనుము వంటి సామాగ్రిని మోస్తూ తొందరగా అనారోగ్యం ఫాలో అవుతున్నారు .చాలి చాలని కూలి తో కుటుంబాలను పోషిస్తున్నారు .వీపు బరువులో మోసినందున వీపు రక్తంతో కమలిపోతుంది .అమాలి పని అదే తక్కువ కూలీరేట్లకు పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ప్రైవేటు ట్రాన్స్పోర్ట్ రంగంలో అనేకమంది యువకులు కొత్తగా ఫీల్డ్ లోకి వస్తున్నారు. టెన్త్ ,ఇంటర్ చదివిన యువకులకు ఎలాంటి ఉద్యోగం లేనందున ఫైనాన్సులో లేదా కిరాయిలకు రోజంతా ఆటోలను నడుపుతున్నారు. రోజంతా ఆటోలను నడుపుతున్నా ఆరోజు కూలి రావడం లేదన్నారు. ఫైనాన్స్ చెల్లించలేక ,కుటుంబానికి సరిపడ ఆరోజు కూలి రాపోవడం తో ఆటోంకర్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోలు డీసీఎంస్ ,టాటా సుమోలు, కార్లు, లారీలు ,వంటి ప్రైవేటు ట్రాన్స్పోర్ట్ కార్మికులకు ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆటో కార్మికులకు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చినప్పటికీ సంవత్సరామ్ నర కాలం గడుస్తున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం ఏమి ఆదుకోలేదు. ఇచ్చిన మాటను మర్చిపోయింది పైగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఫ్రీ బస్సు పెట్టిన తర్వాత ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతిన్నదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం నుండి పనిచేస్తున్నప్పటికీ హమాలీ, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయడం లేదన్నారు .హమాలి ట్రాన్స్పోర్ట్ రంగాల కార్మికులకు ప్రభుత్వం వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమం కోసం సరిపడా నిధులను కేటాయించి కార్మికుల కోసమే ఉపయోగించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రతి సంవత్సరం ఆటో కార్మికులకు 15 వేల రూపాయలను చెల్లించాలన్నారు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉన్నప్పటికీ సంక్షేమ బోర్డులో ఉన్నటువంటి డబ్బులను కార్మికులకు ఉపయోగించకుండా ప్రభుత్వమే వాడుకుంటుంది అన్నారు భవన నిర్మాణ కార్మికులు వారీ పిల్లల పెళ్లిళ్లు, డెలివరీలకు అలాగే సాధారణ మరణం యాక్సిడెంట్ లో చనిపోయిన పని ప్రదేశంలో చనిపోయిన కార్మికులు అనేకమంది లబ్ధిదారులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సంక్షేమ నిధులు భవన నిర్మాణ కార్మికుల కోసం ఉపయోగించకుండా ప్రభుత్వ ఇతర పథకాలకు వెల్ఫేర్ బోర్డులోని బడ్జెట్ను వాడుతున్నారన్నారు కరోనాకాలంలో వ నరేంద్ర మోడీ మన కార్మికులవవకు అందరికీ మోటార్ సైకిళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు ఇప్పటివరకు ఆమె నెరవేరాకపోగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భవన నిర్మాణ కార్మికులు నిధులను వాడుకుంటున్నారన్నారు




కావున భవిష్యత్తులో అసంఘటిత రంగ కార్మికులైన హమాలి భవన నిర్మాణ కార్మికులు ప్రైవేటు ట్రాన్స్పోర్ట్ ఆటో జీపు కారు డీసీఎం ల కార్మికుల కు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్నీ నిలదీయాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు మే 1 వ తేదీన జరిగే 139 వ మే డే సాక్షిగా మే డే స్ఫూర్తితో భవిష్యత్తులో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె ఆ సంఘటన కార్మికుల కు పిలుపునిచ్చారు.

## జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్ మంగళవారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఆర్.వి. కర్ణన్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా నియమితులయ్యారు. బదిలీ పై వెళుతున్న కమిషనర్ ఇలంబర్తి నుండి ఆర్ వి కర్ణన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సేవలందించిన ఆర్.వి. కర్ణన్, హైజీన్ ప్రమాణాలను ఉల్లంఘించిన రెస్టారెంట్లు, పబ్‌లు, ఐస్‌క్రీమ్ పార్లర్లు వంటి ఆహార సంస్థలపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా దాడులు నిర్వహించి, ప్రజలలో ఆహార భద్రతపై అవగాహన పెంచారు. జిహెచ్ఎంసి కమిషనర్ గా కొనసాగిన కె.ఇలంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్‌గా తన పదవీకాలంలో నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పౌర సేవల మెరుగుదల కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో ఏం ఏ యు డి కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ కు అదే విధంగా బదిలీ పై వెళుతున్న ఇలాంబర్ది కి జిహెచ్ఎంసి







అధికారులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు

## మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా ల్యాదాల దంపతుల వివాహా వార్షికోత్సవ వేడుకలు

వేములవాడ,(ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది ల్యాదాల సత్యనారాయణ-కృష్ణవేణి దంపతులు మంగళవారం మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సమక్షంలో తమ 31వ వివాహ వార్షికోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. అంతకు ముందు వారు కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివాహ వార్షికోత్సవాన్ని స్మరణీయంగా మార్చేందుకు,దంపతులు స్థానిక "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలో మంగళవారం అన్నదాతలుగా నిలిచి, అన్నదాతలుగా గత 1467 రోజులుగా నిరంతరంగా కొనసాగుతున్న అన్నదాన సేవా కార్యక్రమంలో భక్తులకు, అన్నార్థులకు,యాచకులకు,భక్తులకు ఉచిత భోజనం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ,




"ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయ పరిరక్షకులుగా ఉన్న ల్యాదాల సత్యనారాయణ దంపతులకు భగవంతుడు ఆయురారోగ్యాలు



ప్రసాదించాలని, ఇలాంటి పెళ్లిరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వొడ్యాల వేణు, నాగుల చంద్రశేఖర్, గజ్జెల శ్రీనివాస్, పొలాస రాజేందర్, పసుల శ్రీనివాస్, సగ్గు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## అద్భుత ఫలితాల పర్వదినం అక్షయ తృతీయ

**- హిందువులందరికీ అక్షయ తృతీయ శుభాకాంక్షలు**

అక్షయ తృతీయ వైశాఖ శుద్ధ తదియనే అక్షయ తృతీయ గా వ్యవహరిస్తారు. అక్షయ అంటే తరగనిది, క్షయం లేనిది అని అర్థం. మహాభారతంల్లో అక్షయపాత్ర పేరు ప్రస్తావనకు వస్తుంది. ఈ పాత్ర ఉన్నవారి ఇంటికి ఎంతమంది అతిథులు వచ్చినా కావాల్సినంత ఆహారాన్ని ఇస్తుందని పురాణాలు చెబుతున్నాయి. వైశాఖ మాసం శుక్లపక్ష తదియను అక్షయ తృతీయగా పురాణాలు పేర్కొన్నాయి. త్రేతాయుగం ప్రారంభం, మహాభారత రచన ఈ రోజునే మొదలైంది. సంపదలకు అధిపతి కుబేరుడు శివుడ్ని ప్రార్థించగా లక్ష్మీ అనుగ్రహాన్ని ఈనాడే ఇచ్చినట్టు శివపురాణం తెలుపుతుంది. అక్షయ తృతీయ పండగ మన హిందువుల్లోనే కాకుండా జైనులలో కూడా చెపుకోతగ్గ పెద్ద పండగ. ఈరోజు ఏ పని ప్రారంభించినా విజయం సిద్ధిస్తుందని పండితుల మాట. ఈ పర్వదినాన ప్రజలు కొత్త పని ఏది ప్రారంభించినా అద్భుత ఫలితాలు దక్కుతాయని విశ్వాసం. అందుకే కొందరు ప్రజలు ఈ రోజు కొత్త ఆస్తులు, కొత్త వస్తువులు కొనుగోలు చెయ్యడం చేస్తారు. మహిళల్లో బంగారం కొంటె లక్ష్మీ దేవి తమతోనే ఉంటుందని నమ్మకం. అక్షయ తృతీయ నాడు ఎంతో కొంత బంగారం కొనేందుకు జనం ఎగబడతారు. ఈ రోజున బంగారాన్ని కొనుగోలు చేస్తే ఏడాది మొత్తం సంపద ఉంటుందన్న నమ్మకంతో బంగారాన్ని కొనుగోలు చేస్తారు. మహిళలకు బంగారం పట్ల ఉన్న సహజ ఆసక్తిని గుర్తించిన బంగారం షాపులు ఆకర్షణీయమైన ప్రకటనలతో , అక్షయ తృతీయరోజు అర్ధరాత్రి దాకా వ్యాపార్ని కొనసాగిస్తాయి. అయితే పండితులు మాత్రం అప్పుచేసి అక్షయ తృతీయనాడు బంగారం కొనవద్దని సలహానిస్తున్నారు. అక్షయ తృతీయ నాడు చేసిన ఏ పుణ్య కార్యానికైనా సరే నశించిపోవడం అన్నమాట ఉండదు. అక్షయ తృతీయ విశిష్టతలు మన పురాణాలు, పండితులు చెబుతున్న అక్షయ తృతీయ విశిష్టతలు ఎన్నో ఉన్నాయి. వాటి వివరాలు క్లుప్తముగా ఈ రోజే మహా విష్ణువు ఆరవ అవతారమైన పరశురాముని జననం. ఈ పవిత్ర దినానే త్రేతాయుగం ప్రారంభమైనదని పండితుల మాట. ఈరోజే సింహాచలం దివ్యక్షేత్రం లో సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం మరియు చందనోత్సవం ప్రారంభపు రోజు. ఆదిశంకరుల వారు ఓ పేద వృద్ధ జంట లబ్ది కోసం సృష్టిలో తొలిసారి "కనకధారాస్థవం" స్తుతించిన రోజు. ఈ పవిత్ర దినానే, దివ్య క్షేత్రం "బద్రీనాథ్" ఆలయ ద్వారాలు 4 నెలల దర్శన విరామం తర్వాత, పునః దర్శనార్థమై తెరుచుకోబడతాయి. ఏఏటికాఏడు ఒడిషా పూరి రథయాత్ర సంబరాల కొరకు నిర్మించే రథ నిర్మాణం ప్రారంబించే రోజు. గంగమ్మ భువి పై ఉద్భవించిన రోజు ఈ రోజే. అక్షయ తృతీయ నాడే వ్యాస మహర్షి "మహాభరతం" పవిత్ర గ్రంథాన్ని రచన ప్రారంబించిన రోజు. ఈ రోజే అమ్మ "అన్నపూర్ణ దేవి" అవతరించిన రోజు. అక్షయ తృతీయ పవిత్ర దినాన్నే కుబేరుడు శివానుగ్రహాన్ని పొంది మహలక్ష్మి ద్వారా అనంత సంపదను పొంది సంరక్షకుడిగా నియమింపబడ్డాడు. శ్రీకృష్ణుడు ద్రౌదపదిని దుశ్శాసునుడి నుండి కాపాడిన రోజు. శ్రీకృష్ణుడు తన బాల్యమిత్రుడైన కుచేలుడు తెచ్చిన అటుకులను ఆరగించి అపార సంపదను అనుగ్రహించిన రోజు. సూర్యభగవానుడు అజ్ఞాతవాసంలో పాండవులకు "అక్షయపాత్ర"ను ఇచ్చినరోజు. బృందావనంలోని బంకె బిహరి ఆలయంలో శ్రీకృష్ణుని పాదాలను




దర్శించుకొనే అవకాశం ఒక్క అక్షయ తృతీయ రోజునే దక్కుతుంది.



## వివాదంలో విజయ్ దేవరకొండ

### – గిరిజన సంఘాల తీవ్ర ఆగ్రహం!

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడిన మాటలపై గిరిజన సంఘాలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తమను కించపరిచేలా విజయ్ మాట్లాడారని, వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... ఇటీవల తమిళ నటుడు సూర్య నటించిన ఒక సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కశ్మీర్‌లోని పహల్గామ్ ఘటనపై స్పందించారు. ఉగ్రవాదులకు సరైన విద్యను అందించి, వారి ఆలోచనా విధానాన్ని మార్చడమే దీనికి పరిష్కారమని అన్నారు. 500 ఏళ్ల క్రితం గిరిజనులు (ట్రైబల్స్) ఘర్షణ పడినట్లుగా కశ్మీర్‌లో దాడులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ట్రైబల్స్ అనే పదం వాడటంపై గిరిజన సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. 500 సంవత్సరాల క్రితం కేవలం గిరిజనులు మాత్రమే ఘర్షణ పడినట్టుగా విజయ్ మాట్లాడటం సరికాదని వారు పేర్కొంటున్నారు. ఉగ్రవాదుల చర్యలను ప్రత్యేకంగా గిరిజనుల నాటి ఘర్షణలతో పోల్చడం తమను కించపరచడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గిరిజన సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ నేపథ్యంలో, విజయ్ దేవరకొండ తక్షణమే గిరిజన సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన విజయ్, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు. ఒకవేళ ఆయన క్షమాపణ చెప్పని పక్షంలో, తాము క్షమించేది లేదని గిరిజన సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ఈ వివాదంపై విజయ్ దేవరకొండ ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

## గుళ్లకు వెళ్లినంత మాత్రానా బీజేపీలో చేరినట్లు కాదు: ప్రీతీ జింతా

గుడులకు వెళ్లినంత మాత్రాన బీజేపీలో చేరినట్లు కాదు అని నటి ప్రీతీ జింతా అన్నారు. విదేశాలకు వెళ్లిన తర్వాత స్వదేశం విలువ మరింత తెలిసి వచ్చిందన్నారు. ఏడేళ్ల బ్రేక్ తర్వాత ప్రీతీ జింతా మళ్లీ హిందీ సినిమాలో నటించనున్నారు. రాజ్‌కుమార్ సంతోషి తీస్తోన్న లాహోర్ 1947లో ఆమె నటిస్తోంది. అయితే ఇటీవల మహాకుంభమేళాకు వెళ్లిన ఆమె అక్కడ పుణ్యస్నానాలు చేశారు. ఆ తర్వాత వారణాసిలో ఉన్న కాశీ విశ్వేశ్వరుడిని మహాశివరాత్రి నాడు దర్శించుకున్నారు. అయితే సోషల్ మీడియాలో ఓ వ్యక్తి ప్రీతీకి ప్రశ్న వేశారు. బీజేపీలో చేరుతున్నారా అని ఆమెను అడిగారు. సోమవారం రాత్రి ఆ ప్రశ్నకు ప్రీతి జింతా బదులిచ్చారు. సోషల్ మీడియా జనంతో ఇదే సమస్య అని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా ద్వారానే నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. గుడికి వెళ్లినా, కుంభమేళాకు వెళ్లినా.. తన ఐడెంటీ పట్ల గర్వంగా ఫీలవుతున్నానని, దీని ఉద్దేశంతో రాజకీయాల్లో చేరుతున్నట్లు కాదన్నారు. విదేశాల్లో ఉన్న సమయంలో.. భారత దేశ ఔనత్యం తెలిసివచ్చిందన్నారు. అందరి తరహాలోనే తాను కూడా భారత దేశాన్ని అభినందిస్తున్నాన్నారు. విదేశాల్లో జీవిస్తున్న ఓ తల్లిగా.. తన పిల్లలకు భారతీయ విలువలు నేర్పుస్తున్నట్లు చెప్పారు. భారతీయ మూలాలు ఉన్న విషయాన్ని మరిచిపోకుండా చేస్తున్నాన్నారు. ప్రీతీ జింతా ప్రస్తుతం లాస్ ఏంజిల్స్‌లో తన భర్త జీన్ గుడ్‌ఎనాఫ్‌తో కలిసి జీవిస్తున్నారు. ఆమె కవల పిల్లలు గియా, జే కూడా వారితోనే ఉన్నారు. మా పిల్లలను హిందువులుగా పెంచుతున్నామని, కానీ తమపై విమర్శలు వస్తున్నాయని, కొందరు దీన్ని రాజకీయం చేస్తున్నారని, పిల్లలకు వాళ్ల మతం గురించి చెబుతున్నట్లు ఆమె చెప్పారు.



### తన ఒంటిపై పాత టాటూలు గురించి


## స్పందించిన సమంత..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. తమిళ అమ్మాయి అయిన కూడా తెలుగు ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకుంది. నాగ చైతన్యని పెళ్లి చేసుకున్న తర్వాత ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకులకి మరింత దగ్గరైంది. నాగ చైతన్య, సమంత రూత్ ప్రభు విడిపోయి చాలా ఏళ్లు గడిచిపోయిన కూడా ఇప్పటికీ చాలా మంది తెలుగు ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసుకుంది. చైతూ మరో వివాహం చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించిన కూడా సామ్ పెళ్లి చేసుకోకుండానే ఎప్పటిలాగే తన కెరీర్ మీద ఫోకస్ పెట్టింది. ఏ మాయ చేశావే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయిన సమంత అదే సినిమాలో నాగ చైతన్య హీరోగా నటించాడు. ఈ సినిమా తర్వాత చై, సామ్ ప్రేమలో పడి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత కొన్నాళ్లకే ఈ జంట విడిపోయారు. ఈ ఇద్దరూ ఎందుకు విడిడిపోయారో ఇప్పటికీ ఎవరు తెలియరావడం లేదు. అయితే నాగ చైతన్య నుండి విడిపోయిన తర్వాత సమంత మాయోసైటిస్ బారినపడిన విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడు సామ్ మాయోసైటిస్ నుంచి కోలుకుంటుంది. ఇక సినిమాలకు ఏడాది పాటు సినిమాలకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు.. తిరిగి సినిమాల్లోకి వచ్చి సందడి చేసేందుకు సిద్ధమైంది. ఇటీవలే శుభం అనే సినిమాను కూడా పూర్తిచేసింది. ఇందులో సమంత కీలక పాత్రలో కనిపించి అలరించనుంది. అయితే చై – సామ్ విడాకులు తీసుకున్నా, కొన్ని విషయాలు మాత్రం ఇప్పటికీ వీరిద్దరికీ ముడిపడి ఉన్నాయి. అవేంటంటే.. హౌస్, ఒంటి మీదున్న టాటూలు. ఇద్దరు విడిపోయినా, వీరి ప్రేమ బంధానికి గుర్తుగా వేసుకున్న టాటూలు మాత్రం ఇప్పటికీ చర్చనీయాంశంగా మారుతున్నాయి. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సమంత గత ఏడాది 'ఆస్క్ మీ ఎనీథింగ్' అనే సెషన్ ని అభిమానులతో ఇంటరాక్ట్ అయింది. ఈ సెషన్ లో అభిమానులు ఆమెని అనేక ప్రశ్నలు అడిగారు. అందులో ఒక అభిమాని 'ప్రేమికులు టాటూలు వేయించుకోవడం పై మీ అభిప్రాయం ఏమిటి?' అని అడగగా దానికి ఆమె సమాధానం చెప్తూ 'నా అభిమానులకు ఈ సందర్భంగా ఒకటి చెప్పాలని అనుకుంటున్నాను. ప్రేమించుకుంటే ప్రేమించుకోండి పర్లేదు కానీ, టాటూ మాత్రం వేయించుకోవద్దు, ఈ విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండండి' అని చెప్పుకొచ్చింది. అంటే సమంత.. నాగ చైతన్య టాటూ వేసుకొని తప్పు చేసిందా అనే దానిపై చర్చ నడుస్తుంది.



### ఉగ్రవాదులకు వార్నింగ్ ఇచ్చిన

## బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి



ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ దారుణ సంఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. రాజకీయ, సినీ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు ముక్తకంఠంతో ఈ దాడిని ఖండిస్తున్నారు. తాజాగా, ఈ ఘటనపై బాలీవుడ్ ప్రముఖ నటుడు ఇమ్రాన్ హష్మి తీవ్రంగా స్పందించారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించిన ఇమ్రాన్ హష్మి... ఈ దుశ్చర్యకు పాల్పడిన వారు కచ్చితంగా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఉగ్రవాదానికి ఎలాంటి మతం ఉండదని, దానిని ఏ మతంతోనూ ముడిపెట్టరాదని ఆయన అన్నారు. పర్యాటకులపై జరిగిన ఈ దాడి పక్కా ప్రణాళికతో జరిగిందని అభిప్రాయపడ్డారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పహల్గామ్ పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటం దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగానూ విమర్శలకు దారితీసింది. పలు దేశాల అధినేతలు ఈ దాడిని ఖండించారు. మానవత్వంపై జరిగిన దాడిగా వారు అభివర్ణించారు. మరోవైపు, ఈ దాడికి బాధ్యులైన ఉగ్రవాదులను పట్టుకునేందుకు భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. పహల్గామ్ పరిసర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాన్ని ఆర్మీ, సీఆర్పీఎఫ్ బలగాలు జల్లెడ పడుతున్నాయి. నిందితులుగా అనుమానిస్తున్న నలుగురు ఉగ్రవాదుల కదలికలను ఇప్పటికే పలుమార్లు గుర్తించినప్పటికీ, వారు భద్రతా బలగాల నుంచి తృటిలో తప్పించుకున్నారని సమాచారం.

### శివనామ స్మరణతో

## మోత మోగిపోతున్న టాలీవుడ్




టాలీవుడ్ స్థాయి పెరిగింది. వైవిధ్యమైన చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. డిఫరెంట్ కంటెంట్‌ని ప్రేక్షకులు ఆదరిస్తున్న నేపథ్యంలో మేకర్స్ కూడా కొత్త దనాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే దేవుళ్లపై టాలీవుడ్‌లో చాలా సినిమాలు రూపొందాయి. ముఖ్యంగా శివుడికి సంబంధించిన చిత్రాలు ఎన్నో తెరకెక్కడమే కాకుండా మంచి విజయాలు సాధించాయి. అయితే ట్రెండ్‌కి తగ్గట్టుగా శివయ్యపై సినిమాలు చేస్తున్నారు. ఇటీవలే తమన్నా నటించిన ఓదెల2 చిత్రం శివయ్య ప్రధానంగా రూపొందిన చిత్రమే. అలానే – శివం భజే శివుడు కీలకంగా రూపొందింది. ఈ రెండు ఈ మధ్య కాలంలో రిలీజ్ అయి మంచి ఫలితాలు సాధించాయి. తాజాగా పాన్ ఇండియాలో శివ నామస్మరణ మోగించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. మంచు విష్ణు ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న కన్నప్ప ప్రాజెక్ట్ మంచు ఫ్యామిలీకే డ్రీమ్ ప్రాజెక్ట్ కాగా, ఇది శివుని భక్తుడు కన్నప్ప కథ ఆధారంగా తెరకెక్కింది. గత కొద్ది రోజులుగా ఈ మూవీ తెగ వార్తలలో నిలుస్తుంది. అందుకు కారణం ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, మోహన్ బాబు, మధు ప్రీతి ముకుందన్ లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషించడమే. జూన్‌లో ఈ మూవీ విడుదలకి సిద్ధం కాగా, దీనిపై అందరిలో భారీ అంచనాలే ఉన్నాయి. సీజీ పనులు ఆలస్యమవుతోన్న నేపథ్యంలో చిత్ర రిలీజ్ కాస్త వాయిదా వేసి జూన్ 27న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నందమూరి నటసింహ బాలకృష్ణ నటిస్తోన్న అఖండ2 చిత్రం కూడా శివుని నేపథ్యంలో రూపొందుతుంతుంది. బాలయ్య ప్రధాన పాత్రలో బోయపాటి శ్రీను ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో బాలయ్య అఘోరిపాత్రలో విశ్వరూపం చూపించబోతున్నారు. ప్రత్యేకంగా కుంభమేళా కూడా కలిసి రావడంతో, అక్కడ సన్నివేశాలు సినిమాకు హైలైట్ గా ఉంటాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తుంది. అఘోరి పాత్రలో బాలయ్య నట విశ్వరూపం చూపించడం ఖాయం. మరోవైపు సుధీర్ బాబు హీరోగా నటించిన జటాధర కూడా శివుడి కాన్సెప్ట్ ని ఆధారంగానే రూపొందింది. సాయి శ్రీనివాస్ నటిస్తోన్న %–%హైంధవ, అరవింద్ కృష్ణ నటిస్తోన్న ఎ మాస్టర్ పీస్ శివుడి కథ ఆధారంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

## చిన్నగా ఉన్నప్పుడే నన్ను అలా అడిగారు..

### – కాస్టింగ్ కౌచ్‌పై రీతూ చౌదరి సంచలన కామెంట్స్



జబర్దస్త్ షోతో పాపులర్ అయిన వారిలో రీతూ చౌదరి ఒకరు. ఆమె పలు సీరియల్స్, టీవీ షోస్ కూడా చేసింది. ఇప్పుడు యూట్యూబ్ వీడియోలతో పాటు పలు టీవీ షోలలో మాత్రమే సందడి చేస్తుంది. ఇక సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో రచ్చ చేస్తుంటుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఈ క్రమంలో కాస్టింగ్ కౌచ్‌పై కూడా నోరు విప్పింది. తాను పదో తరగతి చదువుతున్నప్పుడే అవకాశాల కోసం ట్రై చేసిందట. ఖమ్మంలో ఉండే తాను సీరియల్ ఆడిషన్ కోసం వాళ్ల నాన్నతో కలిసి హైదరాబాద్ వచ్చిందట. అయితే ఆడిషన్ అయ్యాక మేనేజర్ వచ్చి ఒక సీరియల్ యాక్టర్ పేరు చెప్పి అతనితో అలా ఉంటేనే అవకాశం వస్తుందని అన్నాడట. నువ్వు ఎవరిని తీసుకురావొద్దు, ఒక్కదానివే రావాలని చెప్పాడట. నాకు అప్పుడు వెలగలేదు. చిన్నపిల్లగా ఉన్నప్పుడే నన్ను అలా అడిగారు. సీరియల్ యాక్టర్ అలాంటి వాడా అని షాక్ అయ్యాను. ఇక నా కెరీర్ మొదలయ్యాక ఆ ఫేమస్ సీరియల్ యాక్టర్ తోనే ఓ సీరియల్ లో నటించాను. అప్పుడు ఆ యాక్టర్ ని.. ఆ సంఘటన గురించి అడగాలి అని అనుకున్నా కాని అడగలేకపోయాను. ఆ తర్వాత నాకు మళ్లీ అలాంటి సమస్య ఎదురు కాలేదు అని పేర్కొంది రీతూ చౌదరి. ఒకప్పుడు ట్రోల్స్, కామెంట్లని చాలా సీరియస్‌గా తీసుకునేదాన్ని. కానీ ఇప్పుడు ఏదైనన లైట్. నాన్న ఉన్నప్పుడు నాకు ఇవేం తెలియవు. అన్ని నాన్ననే చూసుకునేవారు. మా అమ్మానాన్నలది లవ్ మ్యారేజ్. మా అమ్మని చాలా అపురూపంగా నాన్న చూసుకున్నారు. నన్ను బాగా చూసుకునేవారు. ఉదయం షూటింగ్ ఉందంటే నా కన్నా ముందు లేచి జ్యూస్, ఫుడ్ ప్రిపేర్ చేసి ఇచ్చేవారు. నాన్న నాతో ఒక ఫ్రెండ్‌లా ఉండేవారు. నాన్నని నేను ఒరేయ్ అని పిలుస్తా. మందు కూడా కలిసి కొట్టాం. అంత కూల్‌గా ఉంటారు నాన్న. ఇప్పుడు నాన్న లేకపోయే సరికి చాలా బాధగా ఉంది. నా ఫ్యామిలీని నేనే చూసుకోవాలని అర్థమైంది. నాన్న చనిపోయినప్పుడు మా ఇంట్లో కూర్చొని బంధువులు నవ్వుకోవడం చూసి నాకు రియాలిటీ అర్థమైంది. నాన్న నన్ను ఏ రోజు ఇలా ఉండు అలా ఉండు అని చెప్పలేదు. టోర్న్ జీన్స్, క్రాప్ టాప్స్ ఇలా నాకు నచ్చిన బట్టలు నేను వేసుకుంటా.. గుడికి వెళ్తే చీర కట్టుకుంటా, పబ్‌కి వెళ్తే ట్రెండీ డ్రెస్ వేసుకుంటా.. నా జీవితం నాకు నచ్చినట్లు నేనుంటా, ఎవరికి సమాధానం చెప్పాల్సిన పనిలేదు అని రీతూ పేర్కొంది.

# రెవెన్యూ రారాజుకు ఘన వీడుకోలు



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ పరిధిలో ముగ్గురు ఉన్నత హోదా కలిగిన అధికారులు ఈనెల ఏప్రిల్ చివరి వరకు పదవి బాధ్యతలు పూర్తవుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు వారి సేవలను గుర్తిస్తూ, వారికి జిల్లా కార్యాలయంలో సన్మాన వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి తెలిపారు. అలాగే ప్రజలతో ప్రత్యక్షంగా పరోక్షంగా సాహసోపేతమైన నిర్ణయాలతో ముందుకు సాగుతూ... సేవలు అందించడంలో రెవెన్యూ అధికారులు కీలక భూమిక పోషిస్తారు. గత మూడు దశాబ్దాలుగా సిద్ధాంతి అశోక్ కుమార్ రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో ఆయన యంత్రంగానికి అలాగే ప్రజలకు సేవలు అందించి అందరి మనసును గెలుచుకున్నారు. సామాన్యంగా ఏ అధికారి అయిన పదవీ విరమణ పొందేటప్పుడు అంగులు ఆర్భాటాలు లేకుండా వీడ్కోలు తెలుపుతారు. అదే తిరుమలగిరి ఎమ్మార్వో సిద్ధాంతి అశోక్ కుమార్ విషయంలో మాత్రం భిన్నంగా ఉంది. ఎందుకంటే ఓ అధికారి పదవి విరమణ చేసేటప్పుడు ఉన్నతాధికారులు,సిబ్బంది, సామాన్య ప్రజలు పదవి వీడ్కోలు సందర్భంలో చెప్పడం వారి సేవలు వారి మంచితనం గురించి పదేపదే వివరిస్తూ, నిన్నటి వీడ్కోలు కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం పాల్గొన్నారంటే ఆయన గొప్పతనం ఏంటో ఇట్టే అర్థమవుతుంది. సికింద్రాబాద్ ఆర్డిఓ మాట్లాడుతూ సిద్ధాంతి అశోక్ కుమార్ జూనియర్ అసిస్టెంట్ గా ప్రస్థానం ప్రారంభమైందని, అప్పటినుండి 31ఏళ్ళు వివిధ హోదాల్లో తన సేవలు అందిస్తూ, ఇది నిర్వహణలో అందరికీ న్యాయం చేస్తూ ఆయన మంచితనాన్ని చాటారు. తిరుమలగిరి మండల కార్యాలయానికి గడిచిన ఆరు నెలల క్రితం పదవీ బాధ్యతలు చేపట్టి ప్రజలు,రాజకీయ నాయకులు, అధికారుల మనసులను దోచుకున్న ఏకైక అధికారి ఎవరంటే అశోక్ అని చెప్పక తప్పదు.మరో అద్భుతమైన విషయం ఏమిటంటే మండల పరిధిలో ఉన్న ప్రజలే కానీ సిబ్బంది,అధికారులు ఎవరేం చెప్పినా ఎస్ అంటూ అందరినీ ఐస్ చేస్తూ చిరు మందహాసంతో సేవలందించేవారు.

## హైదరాబాద్ ఆర్డీవో ఆర్కె

హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ మాట్లాడుతూ గత కొన్ని ఏళ్ళుగా సిద్ధాంతి అశోక్ కుమార్, తనకు సుపరిచితులే అంటూ సభాముఖంగా వెల్లడించారు. అలాగే ఆయనతో విధి నిర్వహణలో వయసులో పెద్దవారైనా అశోక్ కుమార్ ను అన్నా అని సంబోధించే వానినని ఆయన వెల్లడించారు. రెవెన్యూ శాఖలో సిద్ధాంతి 30 ఇయర్స్ ఇండస్ట్రీ అంటూ నవ్వుల పువ్వులు పూజించారు. ఎస్ బాస్ అంటూ ఎవరిని నొప్పించకుండా, తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగే వారిని గుర్తు చేశారు. ఉన్న 64 శాఖలలో పోలీస్ శాఖ తర్వాత రెవెన్యూ శాఖనే అంటూ ఎలాంటి విపత్తులు వచ్చిన అటు పాలకులు కావచ్చు ఇటు ప్రజలు కావచ్చు.. రెవెన్యూ శాఖ వైపే చూస్తారన్న విషయాన్ని ఆయన సభాముఖంగా వెల్లడిస్తూ, కత్తి మీద సాము వంటి ఉద్యోగం అని గుర్తు చేశారు. అలాంటి ఉద్యోగంలో మనం నిత్యం సాహసోపేతమైన పనులు చేస్తూ...అటు పాలకులను ఇటు ప్రజలను ఒప్పిస్తూ మెప్పిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు.

## డీ ఆర్ ఓ వెంకటాచారి

తిరుమలగిరి ఎమ్మార్వో సిద్ధాంతి అశోక్ కుమార్ తనకి కొంతకాలంగా తెలుసని, అలాగే అధికారిగా కాకుండా కుటుంబ బంధువుగా తెలుసని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే అశోక్ కుమార్ ఒక ఎమ్మార్వో గా అందరికీ సుపరిచితమని, నాకు మాత్రం ఆయనలో ఉన్న పౌరాణిక కళాకారుడిగా తనకు తెలుసని ఆయన రంగస్థలంపై భీష్ముడు, కృష్ణుడు,భీముడుగా పౌరాణిక నాటకాలతో రత్తి కట్టించే వారన్నారు. అందర్నీ అలరించే వారిని వెంకటాచారి తెలిపారు. అలాగే పదవి విరమణ అనంతరం ఆయనలో దాగి ఉన్న పౌరాణిక కలను పూర్తిస్థాయిలో అందరికీ తెలిసేలాగున ప్రదర్శనలు ఇవ్వాలని సూచించారు. తిరుమలగిరి మండల రెవెన్యూ అధికారి అశోక్ అధికారికంగా పదవీ విరమణ పొందారు. గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ సేవలో ఉన్న ఆయన, ప్రజల సంక్షేమం కోసం అత్యుత్తమ సేవలు అందించిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. తిరుమలగిరి మండల ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం ఆయన సేవలను ప్రశంసిస్తూ ఘనంగా వీడ్కోలు చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు అధికారులు ఆయనతో గడిపిన అనుభవాలను పంచుకున్నారు. అశోక్ తన పదవీకాలంలో పౌర సేవల అందింపులో పారదర్శకతకు పెద్దపీట వేశారు. పథకాల అమలులో సమర్థతతో పాటు, గ్రామస్థుల సమస్యలపై స్పందనతో పనిచేశారు. గ్రామ పటాలను డిజిటల్ పద్ధతుల్లో రూపొందించడం, భూముల రికార్డులను అప్డేట్ చేయడం వంటి కార్యక్రమాలలో కీలక పాత్ర వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రజల ప్రేమ,సహకారం వల్లే ఈ స్థాయిలో సేవ చేయగలిగాను. నేను ఉద్యోగిగా మాత్రమే కాకుండా, ప్రజలలో ఒకరిగా పని చేశాను, అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ సీఈవో మధుకర్ నాయక్, హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, తిరుమలగిరి మండల్ డిప్యూటీ ఎమ్మార్వో హారిక, అల్వాల్ డిప్యూటీ ఎమ్మార్వో పృథ్వీరాజ్, తిరుమలగిరి సర్వేయర్ వెంకటేశ్వర్, సమ్మయ్య,సాయి యాదగిరి, శేఖర్, జిల్లా రెవెన్యూ యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

# ఒకే దేశం,ఒకే ఎన్నిక: సునీల్ బన్సల్



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** ఒకే దేశం ఒకే ఎన్నిక అనే అంశంపై దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ కొత్త చర్చకు తెరలేపినట్లు భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ స్పష్టం చేశారు. కంటోన్మెంట్ తిరుమలగిరిలోని జయలక్ష్మి గార్డెన్ లో బీజేవైఎం జాతీయ కోశాధికారి టీం సాయి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒకే దేశం ఒకే ఎన్నిక అనే అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ తో పాటు తెలంగాణ రాష్ట్ర భాజపా నాయకులు హాజరయ్యారు. ఒకే దేశం ఒకే ఎన్నిక మూలంగా ఎన్నికల ఖర్చుతో పాటు,ఎన్నికలకు అధికారుల ఉద్యోగుల సమయం కూడా వృధా అవుతుందని అన్నారు. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే దక్షిణ భారతదేశంలోని ప్రాంతీయ పార్టీలలో వారసత్వ రాజకీయాలకు చరమగీతం పాడవచ్చని అన్నారు . దేశవ్యాప్తంగా ఒకే దేశం ఒకే ఎన్నిక గురించి నూతన చర్చను భాజపా ప్రారంభించినట్లు ఆయన తెలిపారుజమిలి ఎన్నికల మూలంగా దేశంలో సుపరిపాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భారతదేశంలో ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు ఉండడం మూలంగా అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. జమిలి ఎన్నికల మూలంగా రాజకీయ నాయకులు అధికారుల సమయం వృధా కాకుండా ఖర్చు తగ్గుతుందని అన్నారు. ప్రతి సందర్భంలోనూ వివిధ రాష్ట్రాలలో స్థానిక సంస్థల నుండి జాతీయ స్థాయి వరకు ఎన్నికల నిర్వహించడం మూలంగా రాజకీయ నాయకులు, ప్రభుత్వ యంత్రాంగం అభివృద్ధిపై దృష్టి సారించలేకపోతున్నాయని అన్నారు. ఆరు నెలల్లో జమిలి ఎన్నికలు నిర్వహించుకుని నాలుగున్నరేళ్ళ పాటు దేశ ప్రజలకు అభివృద్ధి సంక్షేమంతో పాటు సుపరిపాలన అందించవచ్చని అన్నారు. దేశ హితం కోసం ప్రజలంతా జమిలి ఎన్నికల గురించి ఆలోచించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. జమిలి ఎన్నికలను దక్షిణ భారతదేశంలో పలు ప్రాంతీయ పార్టీలు వ్యతిరేకిస్తుండడం సమంజసం కాదని అన్నారు. ప్రాంతీయ పార్టీల మనుగడ దెబ్బతింటుందనే ఉద్దేశంతోనే జమిలి ఎన్నికలకు ప్రాంతీయ పార్టీలు సుముఖంగా లేవని అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక నిర్వహించడం మూలంగా దేశంలో నూతన నాయకత్వానికి ఆస్కారం ఉంటుందని,ఓడిపోయిన నేతలే తిరిగి మళ్లీ ఎన్నికలలో పోటీ చేస్తూ రాజకీయంగా కొత్తవారికి అవకాశాలు సన్నగిల్లెలా చేస్తున్నారని అన్నారు. దేశమంతా జమిలీ ఎన్నికల విషయంలో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజేవైఎం జాతీయ కోశాధికారి టీం సాయి, రాష్ట్ర బిజెపి జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, భాజపా జాతీయ ట్రేజరర్ సాయి ప్రసాద్,సీనియర్ పాత్రికేయులు సురేష్ కుచ్చుట్ల భాజపా ఎమ్మెల్సీ రాంచందర్ రావు,సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సివిల్ మెంబర్ భానుక నర్మదా, మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు రామకృష్ణ, భాజపా సీనియర్ నేతలు వంశా తిలక్,భానుక మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎంపీఎస్ మేడ్చల్ మండల రెండవ మహాసభ



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ఈ సందర్భంగా (జీఎంపీఎస్)సభ విజయవంతం కావడంతో మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేకల కుమార్, ఎక్కలదేవి కొమురయ్య మాట్లాడుతూ (జీఎంపీఎస్)కమిటీ అనేక సమస్యల పైన పోరాటం చేసిందని ఇప్పుడున్న పరిస్థితిలో గొర్రెల మేకల పెంపకం దారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని గొర్రెలు మేకలు మేపడానికి స్థలం లేకఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం సబ్సిడీ మీద దాన సరఫరా చేయాలి గొర్రెల మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయాలి ప్రభుత్వం గొర్రెల మేకలకు మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులు తాగించాలి ఆసుపత్రిలో వ్యాక్సిన్లు మందులు అందుబాటులో ఉండేలా చూడాలి పశువైద్యశాలను ఉదయం 7 గంటల నుండి ప్రారంభించేయల మార్పు చేయాలి 50 సంవత్సరం దాటిన గొర్రెల కాపరికి 5000/ పింఛన్ ఇవ్వాలి వివిధ ప్రమాదంలో చనిపోతున్న గొర్రెల కాపరికి 10 లక్షల ఎక్స్గ్రేషన్ ప్రభుత్వం చెల్లించాలి కేంద్ర ప్రభుత్వం ఎన్ఎల్ఎం పథకంలో గొల్ల కురుమ యువతకు 50 శాతం రిజర్వేషన్లు గొర్రెల ఫామ్స్ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలి దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని మేడ్చల్ జిల్లా కేంద్రంలో పెట్టాలి డిమాండ్ చేశారు

మేడ్చల్ మండలం నూతన కమిటీని 25 మందితోని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు సల్ల పెద్ద కృష్ణ.ప్రధాన కార్యదర్శి కౌడి శ్రీశైలం. గౌరవ అధ్యక్షులు బుల్లి వెంకటేశం. ఉపాధ్యక్షులు కురుమ పర్వతాలు. మాసిని మల్లేష్. సందపురం మల్లేష్. ఎర్రోళ్ల అశోక్ సహాయ కార్యదర్శి లు ఇట్టబోయిన అనిల్ కుమార్. స్నానం కృష్ణ. చీరల సందీప్ . దాసారం వెంకటేష్ సభ్యులు బండ నాగరాజు. బొల్లి మహేష్ పయ్యల. సత్యనారాయణ ఎర్రగుళ్ల రవి. వడ్డేపల్లి పోచయ్య. పింజరుల కనకరాజు. గాయత్రి. కృష్ణ. మద్దెల బాల నరసింహ. బుల్ల బోయిన చిన్న తుప్పతి కుమార్. చీరల సాయికుమార్. మామిళ్ళ ఆనంద్. సిహెచ్ యాదగిరి.నిమ్మల కిషోర్ జిల్లా ఉపాధ్యక్షులు. సానం మల్లేష్ జిల్లా సహాయ కార్యదర్శి. భావని వెంకటేశం మాజీ కౌన్సిలర్. కౌడి మహేష్ మందపురం నరేష్. తదితరులు పాల్గొన్నారు

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మేడ్చల్ జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్



**మేడ్చల్( ప్రశ్నన్యూస్)** రైతులకు అండగా ఉంటూ,వారికీ ఆర్థికంగా తొడ్పాటు అందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ ఉమ్మడి మండల పరిధిలోని డబిల్ పూర్ కో ఆపరేటివ్ సొసైటీ (పీ ఎ సి ఎస్) ఆధ్వర్యంలో కోనాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అగ్రికల్చర్ ఎక్స్ క్యూటివ్ ఆఫీసర్ సుమిత,డబిల్ పూర్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ సద్ధి సురేష్ రెడ్డి తో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మేడ్చల్ జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ తో కలిసి పాల్గొన్న మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ. ఈ సందర్భంగా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్,మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలి,మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు 500బోనస్ అందిస్తున్నట్లు గుర్తుకు చేశారు. రైతులకు ఉచిత కరెంట్,రుణ మాఫీ,రైతు భరోసా,500బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజా ప్రభుత్వం అని అన్నారు. అయినప్పటికీ రైతులకు గిట్టుబాటు కావడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర పెంచాలని,కనీసం 3000 వేల రూపాయలు ఉండే విధంగా పెంచాలని డిమాండ్ చేశారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. అందుకోసమే రాష్ట్రంలో సన్నాలు పండించే రైతులను ప్రోత్సహిస్తుందని అన్నారు. దీనివల్ల మన రైతుల వద్దనే సన్నాలు కోని మళ్ళీ మనకే సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందువలన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే పంటను అమ్మాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదని కావున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డబిల్ పూర్ కో ఆపరేటివ్ సొసైటీ వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్,డబిల్ పూర్ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్లు మధు సూదన్,మేడ్చల్ జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రేగు రాజు కురుమ,దుర్గం శివ శంకర్ ముదిరాజ్,తుంకి భిక్షపతి మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోమారం రమణా రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కురుమ,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ,మేడ్చల్ మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బట్టు మధు, బ్రహ్మ రెడ్డి,మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్ గౌడ్,జార్జ్,సల్ల వెంకటేష్ యాదవ్,సుదర్శన్ రెడ్డి, నరేందర్ సింగ్,దాగ్గిల శంకర్,దేవేందర్ రెడ్డి,డబిల్ పూర్ కో ఆపరేటివ్ సొసైటీ అధికారులు,వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు,మహిళా సంఘాలు,స్థానిక ప్రజా ప్రతినిధులు,పుర ప్రముఖులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దాసరి శ్రీనివాసరావు, ప్రసన్న జ్ఞాపకార్థంగా ఉచిత మజ్జిగ పంపిణీ



**కూకట్ పల్లి (ప్రశ్నన్యూస్)** దాసరి శ్రీనివాసరావు, ప్రసన్న జ్ఞాపకార్థంగా, కె.పి.హెచ్.బి లోని భాగ్యనగర్ కాలనీలో రాహుల్ దాసరి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోల్డ్ మాన్గా కొండా విజయ్ ముఖ్య అతిథిగా హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండా విజయ్ మాట్లాడుతూ, వేసవి తీవ్రత నుండి ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా మజ్జిగ పంపిణీ చేయడం అనేది అభినందనీయమని, రాహుల్ దాసరి టీంకు తెలిపారు. మరెన్నో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని వారిని ప్రోత్సహించారు. ఈ వేసవి కాలం మొత్తం పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాసాగర్, శ్రీనివాస్ యాదవ్, హరికుమార్, హరికృష్ణ, సతీష్ నాయుడు, బుల్లెట్ రవి, రవీందర్, రాకేష్, అర్జున్ తదితరులు

# వేసవిలో అంగన్వాడి పౌష్టికాహార సేవలు ప్రీస్కూల్ సేవలు అందుతాయి



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) గర్భిణీలకు బాలింతలకు ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు వేసవి సెలవుల్లో సైతం అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఎండాకాలం నెల రోజులపాటు గర్భిణీలకు బాలింతలకు ప్రీస్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది. దీనిలో భాగంగా 15 రోజులపాటు ఆయాలకు 15 రోజులపాటు టీచర్లకు సెలవులు ప్రకటించారు. అంగన్వాడీ కేంద్రంలో ఒకరు తప్పనిసరిగా ఉండి నెలలో పూర్తిస్థాయి సేవలు అందిస్తారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం కొదురుపాక సెక్టార్లో, ఎల్లారెడ్డిపేట సెక్టార్ లో టీచర్లకి అవగాహన శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరిగింది. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేపట్టాల్సిన ప్రత్యేక కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు బోయిన్పల్లి లో కొదురుపాక సెక్టార్లో శంకరమ్మ ఎల్లారెడ్డిపేట సెక్టార్లో కళావతి, జిల్లా ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ రోజా, టీచర్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలు



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) అల్మాస్పూర్ గ్రామానికి చెందిన నీరంక శంకర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న నీరంక శంకర్ (38) కు వెంకటపూర్ శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే శంకర్ తన తల్లి మృతి చెందడంతో సంవత్సరికం చేయడానికి అని రకాల కూరగాయలు, చికెన్ తీసుకొని వెంకటాపూర్ వైపు వెళుతుండగా వెంకటాపూర్ శివారులో కామారెడ్డి వైపు వెళుతున్న కారు గుద్దడంతో శంకర్ కుడికాలు విరిగి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్ వాహనానికి, పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శంకర్ ను 108 లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అటుగా వెళుతున్న డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి గమనించి తన వాహనాన్ని నిలిపి శంకర్ ను దగ్గరుండి ఆసుపత్రికి తరలించారు.

# రాజీవ్ యువ వికాసం

# రెండు కేటగిరీలలో అందరికీ డబ్బుల సాయం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యో వికాసం పథకం అమలు చేస్తుంది. ఈ పథకం కింద రూ 50 వేల నుంచి రూ.5 లక్షల వరకు సాయం అందించేలా ఉపాధి యూనిట్లను ఎంపిక చేసింది. ఉపాధి యూనిట్ ఎంచుకొని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుకు యూనిట్ పెట్టుబడి ఆధారంగా బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వనుంది. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ పూర్తయింది. లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.




### ఆ రెండు కేటగిరీలు అందరికీ సాయం..

కేటగిరీ-1, కేటగిరీ-2లో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ పథకం ద్వారా కేటగిరీ-1 కింద 100 శాతం రాయితీతో రూ.50,000, కేటగిరీ-2 కింద 90 శాతం రాయితీతో రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందనుంది. ఈ రెండు కేటగిరీలకు కలిపి కేవలం 1.32 లక్షల దరఖాస్తులు రావడంతో, అందరికీ సాయం అందించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, రూ.4 లక్షల యూనిట్ల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడం గమనార్హం.




### పథకం లక్ష్యం..

రాజీవ్ యువ వికాసం పథకం 2025లో తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ సముదాయాల యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రూ.6,000 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభించింది. ఈ పథకం ద్వారా 5 లక్షల మంది యువతకు ఆర్థిక సాయం అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ పథకాన్ని ప్రకటించగా, సీఎం రేవంత్ రెడ్డి దీని అమలుకు కీలక సూచనలు జారీ చేశారు.

### కేటగిరీల వివరాలు: రాయితీలు, లోన్లు

రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆర్థిక సాయం మూడు కేటగిరీలలో అందుబాటులో ఉంది. కేటగిరీ-1: రూ.50,000 వరకు లోన్‌లకు 100 శాతం రాయితీ. ఈ కేటగిరీ చిన్న తరహా వ్యాపారాలకు అనువైనది.
కేటగిరీ-2: రూ.50,001 నుంచి రూ.1 లక్ష వరకు లోన్‌లకు 90 శాతం రాయితీ, మిగిలిన 10 శాతం బ్యాంకు లోన్ లేదా లబ్ధిదారుడు భరించాలి. కేటగిరీ-3: రూ.1 లక్ష నుంచి రూ.4 లక్షల వరకు లోన్‌లకు 70-80 శాతం రాయితీ, మిగిలిన మొత్తం బ్యాంకు లింకేజీ ద్వారా సమకూరుతుంది. కేటగిరీ 1, 2 లకు

### తక్కువ దరఖాస్తులు..

కేటగిరీ-1, 2లో దరఖాస్తుల సంఖ్య ఊహించిన దానికంటే తక్కువగా (1.32 లక్షలు) రావడంతో, అర్హులందరికీ సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, రూ.4 లక్షల యూనిట్ల కోసం అధిక దరఖాస్తులు రావడంతో, ఈ కేటగిరీలో ఎంపిక కమిటీ ఆధారంగా లబ్ధిదారులను ఎంచుకుంటారు.

### అర్హత ప్రమాణాలు..

ఈ పథకం కింద ఆర్థిక సాయం పొందేందుకు కొన్ని అర్హత ప్రమాణాలు నిర్దేశించబడ్డాయి. నివాసం: దరఖాస్తుదారు తెలంగాణ రాష్ట్రానికి చెందిన శాశ్వత నివాసి అయి ఉండాలి. సముదాయం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ సముదాయాలకు చెందినవారై ఉండాలి. వయస్సు: వ్యవసాయేతర ప్రాజెక్టులకు 21-55 సంవత్సరాలు, వ్యవసాయ సంబంధిత ప్రాజెక్టులకు 21-60 సంవత్సరాలు. ఆదాయం: గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల వార్షిక ఆదాయం మించకూడదు. అవసరమైన పత్రాలు: ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువపత్రం, డ్రైవింగ్ లైసెన్స్ (ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ కోసం), పట్టాదార్ పాస్‌బుక్ (వ్యవసాయ పథకాల కోసం). జూన్ 2న సాంక్షన్ లెటర్లు..ఏప్రిల్ 6 నుంచి మే 31, 2025 వరకు అర్హత స్క్రీనింగ్ జరుగుతుంది. ఎంపికైన అభ్యర్థులకు జూన్ 2, 2025 (తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం) నాడు సాంక్షన్ లెటర్లు పంపిణీ చేయనున్నారు.

### ఎందుకు తక్కువ దరఖాస్తులు

**కేటగిరీ-1,** 2లో ఊహించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడానికి కొన్ని కారణాలు ఉన్నాయి ప్రచారం లోపం: గ్రామీణ ప్రాంతాల్లో పథకం గురించి తగిన అవగాహన కల్పించడంలో లోపం. సాంకేతిక సమస్యలు: ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో కొందరు సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పత్రాల **సేకరణ:** కుల ధ్రువపత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం వంటి డాక్యుమెంట్ల సేకరణలో ఆలస్యం. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం సేవా కేంద్రాల వద్ద సహాయ డెస్క్‌లను ఏర్పాటు చేసింది, అలాగే హెల్ప్‌లైన్ (040-2320334,helpdesk.obms @cgg.gov.in) ద్వారా సాయం అందిస్తోంది. రాజీవ్ యువ వికాసం పథకం తెలంగాణ యువతకు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే అవకాశాన్ని అందిస్తోంది. కేటగిరీ-1, 2లో అర్హులందరికీ ఆర్థిక సాయం అందించాలన్న ప్రభుత్వ నిర్ణయం ఈ పథకం యొక్క సమగ్రతను, సమానత్వాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ చర్య యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాక, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడనుంది.

# కేసీఆర్ బాగుండాలి

## ప్రతిపక్షంలోనే ఉండాలి: జగ్గారెడ్డి



**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే 22 వేల కోట్ల రుణమాఫీ చేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందని వ్యాఖ్యానించారు. "పదేళ్లలో కేసీఆర్ చేసిన రుణమాఫీ 20 వేల కోట్ల రూపాయలు మాత్రమే. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే 22 వేల కోట్లు మాఫీ చేసింది. ఇప్పుడు ఎవరు గొప్పో రైతులే నిర్ణయించాలి," అని జగ్గారెడ్డి అన్నారు. సీఎం రేవంత్ అమలు చేసిన ఉచిత బస్సు పథకంపై మహిళలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కేసీఆర్‌పై నేరుగా విమర్శలు చేస్తూ జగ్గారెడ్డి, "ఎప్పుడు రాష్ట్రంలో సమస్యలే అని చెబుతున్న కేసీఆర్, గత పదహారు నెలలుగా ఇంట్లోనే ఎందుకు ఉన్నారు? ప్రజల కష్టాలు చూసేందుకు ఎందుకు బయటికిరాలేదు?" అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. రైతు రుణమాఫీపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ స్వయంగా సమయం, ఊరు నిర్ణయించాలని సవాల్ విసిరారు. "కేసీఆర్ ఎప్పుడూ బాగుండాలి... కానీ ప్రతిపక్షంలోనే ఉండాలి," అని ఎద్దేవా జగ్గారెడ్డి చేశారు.

## పేదల కోసం భూభారతి...

# అసెంబ్లీలో బీఆర్ఎస్ అడ్డుకుంది



**కామారెడ్డి జిల్లా ( ప్రశ్న న్యూస్) :** అసెంబ్లీలో భూభారతి చట్టాన్ని బీఆర్ఎస్ అడ్డుకున్నా... పేద ప్రజల కోసం తీసుకొచ్చామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని షెట్టుపల్లిలో నిర్వహించిన భూ భారతి కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మదన్ మోహన్, ఎంపీ సురేష్ షట్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి బీఆర్ఎస్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. "ఒక మంచి భూ చట్టం తయారీకి 9 నెలల పాటు మేధోమథనం చేశాం. పేదల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని, అన్ని వర్గాల సలహాలు, సూచనలతో భూ భారతి చట్టాన్ని తెచ్చాం" అని మంత్రి తెలిపారు. అసెంబ్లీలో ఈ చట్టాన్ని బీఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నం చేసింది పొంగులేటి ఆరోపించారు. "అంబేద్కర్ స్ఫూర్తితో ఈ చట్టాన్ని ప్రజల కోసం రోల్ మోడల్‌గా తయారు చేశాం. గత ప్రభుత్వం ధరణి వ్యవస్థ పేరిట పేదల భూములను లాక్కుంది. కానీ ఇప్పటి నుంచి భూ సమస్యల పరిష్కార బాధ్యత రెవెన్యూ యంత్రాంగం తీసుకుంటుంది. 15 రోజుల్లో గ్రామ రెవెన్యూ అధికారులను నియమిస్తామని పొంగులేటి స్పష్టం చేశారు. త్వరలో 6 వేల మంది ప్రైవేట్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేస్తాం. పాసు బుక్స్ లో మ్యాప్స్ కూడా అందించనున్నాం. అటవీ భూముల సమస్యలకూ పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన నాలుగు మండలాల్లో భూ సమస్యలను జూన్ 2లోగా పరిష్కరిస్తామని తెలిపారు. "ఇందిరమ్మ రాజ్యంలో ఆగస్టు వరకు రాష్ట్రంలో భూములకు సంబంధించి ఉన్న సమస్యలన్నింటినీ తీర్చేలా కృషి చేస్తున్నాం. కేసీఆర్ చేయలేని పనులన్నీ మేం చేస్తున్నాం. ఆయన దీనిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని పొంగులేటి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ ఓర్వలేకపోతోందని పొంగులేటి ఆరోపించారు. మే 5లోగా ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. "ఇది ఒక నిరంతర ప్రక్రియ. గత ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసినా, మేం ప్రజా సంక్షేమం కొనసాగిస్తున్నాం. మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే, ఇందిరమ్మ రాజ్యమే," అని మంత్రి స్పష్టం చేశారు.

# ఆపద్బాంధవుల ఆకలి కేకలు

- వర్క్ ఫుల్ జీతాలు నిల్
- అర్ధాకలితో ఉద్యోగుల కేకలు
- అరకొర జీతాలతో ఉద్యోగుల పస్తులు
- 15నెలలుగా జీతాలు ఇవ్వని ప్రభుత్వం
- సకాలంలో వేతనాలు అందలేక ఇబ్బందులు పడుతున్న : తిరుపతి, 1962 వాహన పైలట్.

**"చేస్తున్న చాకిరికి సకాలంలో జీతాలు ఇచ్చి కడుపు కాస్తంత నిండేలా చూడండి మహాప్రభువు అని వేడుకుంటున్నారు 1962 సిబ్బంది. 15 నెలలుగా జీతాలు లేక అల్లాడిపోతున్నామంటున్నారు. పనిచేయుచుకుంటు కడుపు మాడ్చడం న్యాయమా మీకు అని నిలదీస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో మూగజీవాలకు చికిత్స అందించడానికి వెళ్లే 1962 సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతున్నారు."**




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** ఆరోగ్య శ్రీ సేవల్లో భాగంగా 108 అంబులెన్స్ సర్వీసులు ప్రజల్లో ఎంత ప్రాచుర్యం పొందాయో అదే స్ఫూర్తితో మూగజీవాలకు చికిత్స అందించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 1962 సంచార పశు వైద్య సంచార వాహనాలను రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 100 అంబులెన్స్ లను 2017వ సంవత్సరంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. 1962 వాహనాలు గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో మూగజీవాలకు వైద్యం అందిస్తూ పాడి రైతుల మన్ననలు పొందుతున్నాయి. ఒక్కో అంబులెన్స్ కు ఒక పశు వైద్య అధికారి, పారావేట్ డ్రైవర్, హెల్పర్ లు ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా 400 మంది సిబ్బందితో సేవలు అందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వాహన సిబ్బందికి సకాలంలో జీతాలు రాక అప్పుల్లో కూరుకుపోతున్నారు. గత 15 నెలలుగా ప్రభుత్వం 1962 సంచార వాహనాలను నిర్వహిస్తున్న సంస్థకు నిధులు చెల్లించకపోవడంతో 13 నెలలుగా సంస్థ ఉద్యోగులకు సొంతంగా జీతాలు చెల్లిస్తుంది. 3 నెలలకు ఒక సారి ఒక నెలకు సంబంధించి జీతాలు సంస్థ చెల్లించినా అరకొర జీతంతో పూట గడవడమే కష్టంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు జీతాలు నిలిపివేయడంతో ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంలా మారింది. ప్రభుత్వం నిధులు సకాలంలో ఇవ్వకపోయినా క్షేత్ర స్థాయిలో సేవలకు అంతరాయం కలగకుండా సేవలు అందిస్తున్నా ప్రభుత్వం నిధులు విడుదల చేయటంలో జాప్యం చేస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు.

### అరకొర జీతాలతో ఉద్యోగుల పస్తులు :

1962 సంచార వాహన వైద్య సేవలో సేవలు అందించే సిబ్బందికి అరకోర వేతనాలు అందుతున్న సేవల పట్ల అంకితభావంతో పనిచేస్తూ తమ నిబద్ధతను చాటుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం అరకొర వేతనాలు అందిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు వైద్యానికి అందించే నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా అందిస్తున్న ప్రస్తుతం పని చేస్తున్న వైద్యులకు రూ.35 వేలు, అసిస్టెంట్ కు రూ.14 వేలు, డ్రైవర్లకు రూ.8 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పశు వైద్యునికి రూ.56 వేలు, అసిస్టెంట్ కు రూ.20 వేలు, డ్రైవర్ కు రూ.18 వేల చొప్పున చెల్లించాలని నిబంధన ఉన్న అమలు చేయడం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సకాలంలో నిధులు విడుదల చేసి నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఆగస్టు నెలలో సమ్మెకు దిగుతామని ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సకాలంలో వేతనాలు అందలేక ఇబ్బందులు పడుతున్న : తిరుపతి, 1962 వాహన పైలట్ ప్రతి నెల జీతం సరైన సమయానికి రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్న. ఈఎంఐలు, ఇంటి అద్దె, చిట్టీలు, స్కూల్ ఫీజులు చెల్లించలేక... అప్పులు చేయలేక... చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాము. ఇప్పటికైనా ప్రభుత్వం మా జీతాలు వెంటనే అందించాలి.

# ప్రధాని మోదీపై పోస్టు

## - తీవ్ర వ్యతిరేకతతో డిలీట్ చేసిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశిస్తూ కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమం వేదిక 'ఎక్స్'లో చేసిన ఒక వివాదాస్పద పోస్టును తొలగించింది. ఆ పోస్టుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో ఆ పార్టీ ఈ నిర్ణయం తీసుకుంది.కాంగ్రెస్ తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీని లక్ష్యంగా చేసుకుని 'గాయబ్' అంటూ ఒక పోస్టు చేసింది. అయితే, ఈ పోస్ట్ చేసిన కొద్ది సమయానికే పలువురి నుంచి, ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున చర్చ జరిగింది.ఈ పోస్టుపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ప్రధానిని కాంగ్రెస్ లక్ష్యంగా చేసుకుందని అధికార పార్టీ నేతలు ఆరోపించారు. బీజేపీ పార్టీ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ 'పాకిస్థాన్ స్నేహితుడు' అనే ట్యాగ్‌లైన్‌తో రాహుల్ గాంధీ పోలికతో ఒక పోస్టును పెట్టారు. అయితే ఆయన పేరును ఎక్కడా ప్రస్తావించలేదు. తెలుపు రంగు టీషర్ట్, క్యాప్ ధరించిన ఒక వ్యక్తి చేతిలో కత్తి పట్టుకున్న ఫోటోను 'ఎక్స్' ఖాతాలో ఉంచారు.విమర్శలు, వ్యతిరేకత అధికం కావడంతో కాంగ్రెస్ పార్టీ సదరు పోస్టును తమ 'ఎక్స్' ఖాతా నుంచి తొలగించింది. ప్రస్తుతం ఆ పోస్టు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌పై అందుబాటులో లేదు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588